రంజాన్ వేళలు
ఇఫ్తార్ : 6.32 (సోమవారం సాయంత్రం)
సహర్ : 5.00 (మంగళవారం ఉదయం)
బిద్దత్(చేయకూడని, నిషేధించబడిన పనులు)ను అనుసరించే వ్యక్తి దానిని వదులుకొనే వరకూ అతని మంచి పనులను అల్లాహ్ అంగీకరించడానికి నిరాకరిస్తాడు.





'ఇంటర్'లో జోరుగా చూచి రాతలు!

- ఇంటర్ సెల్ఫ్ సెంటర్లలో యథేచ్ఛగా మాస్ కాపీయింగ్
- పదో తరగతిలోనూ చూచి రాతలకు రంగం సిద్ధం?
- ట్రిబుల్ ఐటీలో సీట్లు, మార్కులు గ్యారంటీ అంటూ విద్యార్థుల తల్లిదండ్రులతో బేరసారాలు
- పట్టించుకోని జిల్లా అధికారులు




నిజామాబాద్ అర్బన్, మార్చి 16 (ఆంధ్రజ్యోతి): జిల్లా వ్యాప్తంగా కొనసాగుతున్న ఇంటర్మీడియెట్ పరీక్షల్లో చూచి రాతల పర్వం జోరుగా సాగుతున్నట్లు తెలుస్తోంది. సెల్ఫ్ సెంటర్లలో ఈ వ్యవహారం గుట్టుగా సాగుతున్నా.. అధికారులు మాత్రం చూసీచూడనట్లు వ్యవహరిస్తున్నారనే విమర్శలు ఉన్నాయి. శనివారం జిల్లాలోని బోధన్, నందిపేటలలో ఒకేరోజు తొమ్మిది మంది విద్యార్థులు డిబార్ కావడం మాస్‌కాపీయింగ్ జోరుగా సాగుతున్నందున విమర్శలకు ఊతం ఇచ్చేలా ఉంది. రాబోయే పదో తరగతి పరీక్షలలో సైతం జోరుగా మాస్ కాపీయింగ్ చేయించేందుకు కొంత మంది సీఎస్, డీవోలు ఇప్పటికే ప్రణాళికలు వేసుకున్నట్లు ఆరోపణలు ఉన్నాయి. ట్రిబుల్ ఐటీలలో సీటు గ్యారంటీ, మీ పిల్లలకు రాష్ట్రస్థాయి మార్కులు తెప్పిస్తామని విద్యార్థుల తల్లిదండ్రులతో కొంత మంది ఇప్పటికే బేరసారాలు మొదలు పెట్టినట్లు విమర్శలు ఉన్నాయి. ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాల్లో ఉన్న పదో తరగతి సెల్ఫ్ సెంటర్లలో జోరుగా మాస్ కాపీయింగ్ నిర్వహించేందుకు ఏర్పాట్లు చేసుకుంటున్నట్లు తెలుస్తోంది. గ్రామాభివృద్ధి కమిటీలను మచ్చిక చేసుకొని ఇప్పటికే విందులు, వినోదాలతో పక్కాగా ప్రణాళికలు వేసుకుంటున్నట్లు ఆరోపణలు ఉన్నాయి. ఇదివరకు ఇంటర్మీడియెట్ పరీక్షలకు రెవెన్యూ డిపార్ట్‌మెంట్ నుంచి సిట్టింగ్ స్క్వాడ్‌లను నియమించిన సందర్భాలు ఉండగా ఇప్పుడు అదే శాఖకు చెందిన వ్యక్తులనే సిట్టింగ్ స్క్వాడ్‌లుగా నియమించడంతో కంచె చేను మేసిన చందంగా జోరుగా మాస్ కాపీయింగ్ జరుగుతున్నట్లు ప్రచారం జరుగుతోంది. ముఖ్యంగా కోటగిరి, బోధన్, బాల్కొండ, సిరికొండ, ధర్పల్లి, వర్ని, భీంగల్, నందిపేట్ వంటి సెల్ఫ్ సెంటర్లలో చూచి రాతల పర్వం యథేచ్ఛగా జరుగుతున్నట్లు సమాచారం. రాబోయే పదో తరగతి పరీక్షల నిర్వాహణ సైతం రెవెన్యూ అధికారుల పర్యవేక్షణలో జరిగితే తప్ప.. చూచి రాతలకు అడ్డుకట్ట వేయలేని పరిస్థితి ఉంది.

చేసేవాడు మనోడే... చూసేవాడు మనోడే..

ఇంటర్మీడియెట్ పరీక్షల నిర్వాహణ మొత్తం అస్తవ్యస్తంగా ఉంది. పరీక్షల నిర్వాహణకు సంబంధించి, పరీక్షల పర్యవేక్షణకు సంబంధించి మొత్తం ఇంటర్మీడియెట్ విద్యాశాఖ అధికారులే ఉండటంతో చేసేవాడు మనోడే చూసేవాడు మనోడే మనకేంటి అడ్డు అనే విధంగా జిల్లాలో చూచిరాతల పర్వం కొనసాగుతున్నట్లు విమర్శలు ఉన్నాయి. గతంలో సుదర్శన్‌రెడ్డి మంత్రిగా ఉన్న సమయంలో పరీక్షలను పకడ్బందీగా నిర్వహించాలనే ఉద్దేశ్యంతో రెవెన్యూ అధికారులను సిట్టింగ్ స్క్వాడ్‌లుగా నియమించారు. కానీ ప్రస్తుతం సిట్టింగ్ స్క్వాడ్‌లు అంతా ప్రభుత్వ జూనియర్ కళాశాలల ప్రిన్సిపాళ్లే ఉన్నారు. పరీక్షల పర్యవేక్షణ కమిటీ సభ్యులు కూడా ప్రిన్సిపాళ్లే ఉండటంతో సెల్ఫ్ సెంటర్లుగా ఉన్న వాళ్ల కళాశాలలో ఏమి జరిగినా పట్టించుకున్న దాఖలాలు కనిపించడం లేదు. సొంత డిపార్ట్‌మెంట్ వారే పర్యవేక్షణ అధికారులుగా ఉండటంతో ఇష్టారాజ్యంగా పరీక్షల నిర్వాహణ నిర్వహిస్తున్నట్లు ఆరోపణలు ఉన్నాయి. ప్రస్తుత ఇంటర్మీడియెట్ బోర్డు కమిషనర్ ప్రాక్టికల్ పరీక్షలను సీసీ కెమెరాల పర్యవేక్షణలో నిర్వహించగా ప్రస్తుతం వార్షిక పరీక్షలను సైతం సీసీ కెమెరాల పర్యవేక్షణలో నిర్వహిస్తున్నారు. కానీ గ్రామీణ ప్రాంతాల్లో ఉన్న పరీక్ష కేంద్రాల్లో కేవలం ప్రశ్నపత్రాల సీల్ తెరవడమే సీసీ కెమెరాల పర్యవేక్షణలో నిర్వహిస్తున్నారు. ప్రభుత్వ కళాశాలల ఫలితాల ప్రభావం ప్రిన్సిపాళ్లు, లెక్చరర్లపై ఉండే అవకాశాలు ఉండటంతో పరీక్షలను ఇష్టానుసారంగా నిర్వహిస్తూ ఫలితాలను తమకు అనుకూలంగా వచ్చేలా చూచి రాతలకు ప్రోత్సహిస్తున్నారనే విమర్శలు ఉన్నాయి. ఇంటర్మీడియెట్ పరీక్షల వ్యవహారం మొత్తం సొంత డిపార్ట్‌మెంట్ వారే పర్యవేక్షణ చేస్తుండటంతో ఈ విమర్శలకు బలం చేకూరుతోంది. ఇతర డిపార్ట్‌మెంట్ల పర్యవేక్షణ ఉంటే తప్ప.. ఈ చూచి రాతల పర్వాన్ని అడ్డుకునే అవకాశాలు కనిపించడం లేదు.

పది పరీక్షల మాస్ కాపీయింగ్‌కు రంగం సిద్ధం!

ఈనెల 21 నుంచి ప్రారంభం కానున్న పదో తరగతి వార్షిక పరీక్షల లోనూ చూచి రాతల పర్వానికి కొంత మంది సీఎస్, డీవోలు రంగం సిద్ధం చేసినట్లు తెలుస్తోంది. ముఖ్యంగా సెల్ఫ్ సెంటర్లుగా ఉన్నా పరీక్ష కేంద్రాల్లో ఈ వ్యవహారాన్ని నడిపించేందుకు అన్ని ప్రయత్నాలు చేస్తున్నట్లు ఆరోపణలు వస్తున్నాయి. పదో తరగతి మార్కుల ఆధారంగా బాసర ట్రిబుల్ ఐటీలో సీట్లు పొందే అవకాశం కేవలం గ్రామీణ ప్రాంత విద్యార్థులకే ఉండటంతో అదే అదనుగా కొంత మంది సీఎస్, డీవోలు విద్యార్థుల తల్లిదండ్రులతో ఇప్పటికే బేరాలు కుదుర్చుకున్నట్లు తెలుస్తోంది. మీ పిల్లాడికి ఇన్ని మార్కులు తెప్పిస్తాం, ట్రిబుల్ ఐటీలో సీటు పొందేలా చూస్తామంటూ ఒప్పందాలు చేసుకున్నట్లు సమాచారం. విద్యార్థుల నుంచి వేలల్లో వసూలు చేసినట్లు ఆరోపణలు వస్తున్నాయి. సెల్ఫ్ సెంటర్లపై పర్యవేక్షణ లేక సీఎస్, డీవోలు ఆడిందే ఆట పాడిందే పాటగా వ్యవహారం సాగుతోంది. గతంలో సెల్ఫ్ సెంటర్లలో స్థానిక ఎంఆర్‌వోలను సిట్టింగ్ స్క్వాడ్‌లుగా నియమించినదాఖలాలు ఉన్నాయి. గత కొన్నేళ్లుగా బాల్కొండ, ఆర్మూర్, నందిపేట ప్రాంతాల్లోని ప్రభుత్వ పాఠశాలల్లోని విద్యార్థులకు ట్రిబుల్ ఐటీలలో సీట్లు వస్తున్నాయి. ప్రతీసంవత్సరం జిల్లా నుంచి వందకు పైగా విద్యార్థులు ట్రిబుల్ ఐటీలో సీట్లు పొందుతున్నారు. ఈ అవకాశం గ్రామీణ ప్రాంత విద్యార్థులకు, ప్రభుత్వ పాఠశాలల్లో చదివిన విద్యార్థులకు మాత్రమే ఉండటంతో అదే అవకాశంగా కొంత మంది చూచి రాతలకు ప్రోత్సహిస్తున్నట్లు విమర్శలు ఉన్నాయి. ఇప్పటికైనా కలెక్టర్, విద్యాశాఖ అధికారులు సెల్ఫ్ సెంటర్లపై దృష్టి పెట్టి పరీక్షలను పకడ్బందీగా నిర్వహించాలని విద్యార్థి సంఘాలు, విద్యావేత్తలు కోరుతు న్నారు.




● హాజరైన స్వయం సేవలు

ప్రపంచంలోనే విస్తృత భావాలను కలిగినది
హిందూ సంస్కృతి

● రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్ దక్షిణ మధ్య క్షేత్ర ధర్మ జాగరణ ప్రముఖ్

నిజామాబాద్ కల్చరల్, మార్చి 16 (ఆంధ్రజ్యోతి): ప్రపంచంలోనే విస్తృత భావాలను కలిగినది హిందూ సంస్కృతి అని ప్రపంచానికే ఆదర్శంగా నిలుస్తుందని రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్ దక్షిణమధ్య క్షేత్ర ధర్మ జాగరణ ప్రముఖ్ అమర లింగన్న అన్నారు. ఆదివారం జిల్లా కేంద్రంలోని గిరిరాజ్ కళాశాల మైదానంలో రాష్ట్రీయ స్వయం సేవక్ 100 సంవత్సరాలను పురస్కరించుకొని 56 శాఖలతో నిర్వహించిన సంఘమంలో ఆయన ముఖ్య వక్తగా హాజరై మాట్లాడారు. భారతదేశం ప్రపంచంలోనే శక్తివంతమైన దేశం అని ఏ ఇతర దేశాలకు కూడా హాని కలిగించకుండా తన అభివృద్ధి మాత్రమే చూసుకునే దేశంగా ఉందని ఆయన అన్నారు. భారతదేశం అనేక విదేశీ కుట్రల ప్రభావానికి లోను కావడంతోనే మొఘల్, బ్రిటీష్ వంటి వారు మన దేశ సంస్కృతి సంప్రదాయాలపై దెబ్బతీశారని అన్నారు. స్వాతంత్ర్య సమరయోధంలో డాక్టర్ హెగ్డేవార్ చురుకుగా పాల్గొంటూ ప్రతీ ఒక్క మనిషిని నిశితంగా పరిశీలించి దేశానికి అవసరమైన ఒక సంఘటితం కావాలని బలియమైన కాంక్షతో రాష్ట్రీయ స్వయం సేవక్ సంస్థ ఏర్పాటుకు కృషి చేశారని అన్నారు. నాడు హెగ్డేవార్ స్థాపించినప్పుడు దీనికి ఎలాంటి పేరు నిర్ణయించలేదని అందరిని కలుపుకొని ఆలోచనలు పరిగణలోకి తీసుకొని సంస్థ పేరు ప్రకటించారని అన్నారు. ఆర్ఎస్ఎస్ నేడు ఇన్ని వేల శాఖలు రూపుదిద్దుకున్నాయంటే అందుకు కారణం క్రమశిక్షణ సేవా కృతనిశ్చయం, ధైర్యం వంటి అంశాలు భారతదేశంలోనే ఒక మంచి సంస్థగా నిలబెట్టిందని అన్నారు. స్థాపించిన నాటి నుంచి ఎన్నో ఒడిదొడుకులు ఎదుర్కొంటూ నేడు మన ముందుకు వంద సంవత్సరాల పండుగను జరుపుకోవడం ఆనందాన్ని ఇస్తుందని అన్నారు. హెగ్డేవార్ రాష్ట్రీయ స్వయం సేవక్‌గా ఉండి తన నడవడిక జీవితమే ఒక పుస్తకంగా మనకు అందించారని అన్నారు. సంఘటితంతోనే మనం శత్రుదేశాలను ఎదుర్కోవచ్చని ఆనాడే ఆయన గుర్తించి మనకు మంచి సంస్థను ఏర్పాటు చేయడానికి కృషి చేశారని అన్నారు. స్వాతంత్ర్య సమరయోధంలో రాష్ట్రీయ స్వయం సేవకులు దేశం అంతా పర్యటించి వ్యక్తి తోవ్యక్తి మాట్లాడి మనయొక్క శక్తిని తెలియజేయడంతో పాటు చైతన్యవంతులు చేశారని అన్నారు. నేడు భారతదేశం వివిధ సంస్థల నుంచి ఎన్నో కుట్రలకు గురవుతూ సంస్కృతి సంప్రదాయాన్ని కోల్పోతుందని మనమంతా అప్రమత్తంగా ఉండి కుటుంబం నుంచే మన సంస్కృతిని కాపాడుకునే బాధ్యత తీసుకోవాలని పిలుపునిచ్చారు. అంతకు ముందు రాష్ట్రీయ స్వయం సేవకులు వివిధ శాఖల వారు యోగాసనాలు, శారీరక ప్రదర్శన, ఆటపాటలతో సందడి చేశారు. ఈ కార్యక్రమంలో విభాగ్ సహకార్య వాహశ్రీనివాస్, నగర కార్యవాహ అరుగుల సత్యం, అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్య నారాయణ, బీజేపీ జిల్లా అధ్యక్షుడు దినేష్‌కులాచారి, తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న వక్త అమర లింగన్న


● ఆసనాలు వేస్తున్న అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్

బీఆర్ఎస్ అంటేనే మతసామరస్యానికి ప్రతీక

● ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత

సుభాష్‌నగర్, మార్చి 16 (ఆంధ్రజ్యోతి): బీఆర్ఎస్ అంటేనే మత సామరస్యానికి ప్రతీక అని ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత అన్నారు. జిల్లా కేంద్రంలోని బీఆర్ఎస్ కార్యాలయంలో ఆదివారం ఎమ్మెల్సీ కవిత ఇఫ్తార్ విందును ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కలలో కూడా సీఎం రేవంత్‌రెడ్డి కేసీఆర్ పేరును కలవరిస్తున్నాడని అన్నారు. సీఎం రేవంత్ రెడ్డి రైతులకు రైతుభరోసా, సాగునీరు ఇవ్వకుండా ముచ్చట్లు చెబుతున్నాడని విమర్శించారు. తెలంగాణ ఫ్యూచర్, హిస్టరీ కేసీఆర్ అని ఆమె అన్నారు. కేసీఆర్ మాట్లాడితే జనాలు టీవీల ముందు అతుక్కుపోతున్నారని, రేవంత్ మాట్లాడితే జనాలు టీవీని మ్యూట్ చేస్తున్నారని అన్నారు. పవిత్ర రంజాన్ మాసంలో అబద్ధాలు చెప్పి పాపం మూట కట్టుకోవదన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ముస్లింలకు ఇచ్చిన వాగ్దానాలను మర్చిపోయిందన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో రంజాన్ మాసంలో మసీదులకు లక్ష రూపాయలు ఇచ్చేవారిమని కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన తర్వాత ఒక్క రూపాయి కూడా ఇవ్వలేదని విమర్శించారు. తెలంగాణ పదం అనేది మాకు టాస్క్ వంటిదని వేరే వాళ్లకు మాత్రం అది రాజకీయం అని అన్నారు. అనంతరం బాల్కొండ ఎమ్మెల్యే ప్రశాంత్‌రెడ్డి మాట్లాడుతూ.. శాంతియుత వాతావరణంలో రంజాన్ వేడుకలను జరుపుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యేలు ఆశన్నగారి జీవన్‌రెడ్డి, బిగాల గణేష్‌గుప్త, బాజిరెడ్డి గోవర్ధన్, బోధన్ బీఆర్ఎస్ ఇన్‌చార్జి అయేషా ఫాతిమా, జడ్పీ మాజీ చైర్మన్ దాదన్నగారి విఠల్, మాజీ ఎమ్మెల్సీ వీజీగౌడ్, రెడ్‌కో మాజీ చైర్మన్ ఎస్ఏ అలీమ్, పార్టీ నాయకులు పాల్గొన్నారు.


● మాట్లాడుతున్న ఎమ్మెల్సీ కవిత




సాంగ్లీలో మాట్లాడుతున్న మంత్రి శ్రీధర్‌బాబు

నిజాం షుగర్ ఫ్యాక్టరీపై
ప్రభుత్వం దృష్టి

- మంత్రి శ్రీధర్‌బాబు ఆధ్వర్యంలో సాంగ్లీకి వెళ్లిన బృందం
- బోధన్ ఎమ్మెల్యే, కలెక్టర్‌తో పాటు తరలివెళ్లిన చెరుకు రైతులు
- అక్కడ పరిశీలించిన మీదట నిర్ణయం తీసుకునే అవకాశం

నిజామాబాద్, మార్చి 16 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): నిజాం చక్కెర కర్మాగారం పునఃరుద్ధరించేందుకు ప్రభుత్వం చర్యలు చేపట్టింది. ఇప్పటికే కొంత బకాయిలను చెల్లించిన ప్రభుత్వం మూడు కర్మాగారాలను తెరిపించేందుకు సిద్ధమవుతోంది. బోధన్, మెట్‌పల్లి, మెదక్ కర్మాగారాలను పునఃరుద్ధరించడంతో పాటు చెరుకు సాగును ప్రోత్సహించేందుకు ఏర్పాట్లు చేస్తోంది. ఫ్యాక్టరీలు మూతపడిన తర్వాత చెరకు సాగును తగ్గించి ఇతర పంటలవైపు మళ్లిన రైతులకు అవగాహన కల్పిస్తున్నారు. మహారాష్ట్రలోని సాంగ్లీలో ప్రయోగాత్మకంగా చేపట్టి అధిక దిగుబడులు సాధిస్తున్న విధానాన్ని పరిశీలించేందుకు ఆదివారం మంత్రి శ్రీధర్‌బాబు ఆధ్వర్యంలో ఎమ్మెల్యేలు, అధికారులు, రైతులు వెళ్లారు. అక్కడి ఫ్యాక్టరీలతో పాటు సాగు విధానాన్ని పరిశీలించనున్నారు. అనంతరం ఫ్యాక్టరీని పునఃరుద్ధరించే విధంగా చర్యలను చేపట్టనున్నారు.

ఫ్యాక్టరీ మూతపడి తొమ్మిదేళ్లు

నిజాంషుగర్ ఫ్యాక్టరీ మూతపడి తొమ్మిదేళ్లు అవుతుంది. ఫ్యాక్టరీలో పనిచేస్తున్న వారు కూడా ఇతర ఫ్యాక్టరీలకు వెళ్లిపోగా, కొంత మంది కార్మికులు ఫ్యాక్టరీని నమ్ముకొని ఇక్కడే ఉన్నారు. గత ఎన్నికల సమయంలో తాము అధికారంలోకి వస్తే ఫ్యాక్టరీని తెరిపిస్తామని కాంగ్రెస్ నేతలు ఇచ్చిన హామీ మేరకు ప్రభుత్వం ఏర్పడగానే మంత్రి శ్రీధర్‌బాబు ఆధ్వర్యంలో కమిటీని వేశారు. ఆ కమిటీ మొదట మూడు ఫ్యాక్టరీలను పరిశీలించింది. ఫ్యాక్టరీకి సంబంధించి బకాయిల చెల్లింపు కోసం రూ.240కోట్ల రూపాయలను విడుదల చేసింది. మళ్లీ టెక్నాలజీ పరంగా పరిశీలించడంతో పాటు ఫ్యాక్టరీలను తెరిపిస్తే చెరకు అందుబాటులో ఉండే విధంగా చూస్తేనే నడిచే అవకాశం ఉండటంతో రెండింటిపై దృష్టిపెట్టి ప్రయత్నాలను చేస్తున్నారు. ఇప్పటికే పలు దఫాలు హైదరాబాద్‌లో మంత్రి సమక్షంలో చర్చలు జరిపారు. మూడు ఫ్యాక్టరీ పరిధిలోని ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలతో పాటు ఇతర నేతలు, రైతులు పాల్గొన్నారు. కీలక నిర్ణయం తీసుకోవడంతో పాటు ఒక కంపెనీకి ఫ్యాక్టరీ పునఃరుద్ధరణపై తీసుకోవాల్సిన చర్యల కోసం అప్పచెప్పారు. ఆ కన్సల్టెంట్ కంపెనీ నివేదికను అందించడంతో ప్రస్తుతం ఈ చర్యలను చేపట్టారు.

మంత్రి శ్రీధర్‌బాబు ఆధ్వర్యంలో

మహారాష్ట్రలోని చెరకు ఫ్యాక్టరీలను పరిశీలించేందుకు మంత్రి శ్రీధర్‌బాబు ఆధ్వర్యంలో ఆదివారం ప్రత్యేక బృందం సాంగ్లీకి వెళ్లింది. ఈ బృందంలో మంత్రి శ్రీధర్‌బాబు, బోధన్ ఎమ్మెల్యే, మాజీ మంత్రి సుదర్శన్‌రెడ్డి, పరిశ్రమల శాఖ ముఖ్య కార్యదర్శి జేయేస్ రంజన్, కలెక్టర్ రాజీవ్‌గాంధీ హన్మంతు, చక్కెర ఫ్యాక్టరీ అధికారులు, బోధన్ నియోజకవర్గంకు చెందిన 30 మంది రైతులు వెళ్లారు. సాంగ్లీలో చెరకు ఫ్యాక్టరీలతో పాటు అక్కడి చెరకు సాగు విధానాన్ని అధ్యయనం చేస్తున్నారు. అక్కడి నుంచి వచ్చిన తర్వాత మరోదఫా సమీక్షించి నిర్ణయం తీసుకోనున్నారు. ప్రభుత్వ ఆధ్వర్యంలో నియమించిన కన్సల్టెంట్ కంపెనీ బోధన్ షుగర్ ఫ్యాక్టరీని నడిపించేందుకు నివేదికను అందించింది. షుగర్ ఫ్యాక్టరీని ఇప్పుడున్న మిషన్‌లతో నడిపిస్తే రూ.70 కోట్ల వరకు ఖర్చు అవుతుందని అంచనా వేశారు. మిషన్లు పాతవి కావడం వల్ల రిపేర్లకు ఈ ఖర్చు అవసరం అవుతుందని కొన్నింటిని మార్చాల్సి ఉండటం వల్ల ఈ నిధులు అత్యవసరం అని నివేదికలో పేర్కొన్నారు. ప్రస్తుతం ఉన్న ఫ్యాక్టరీలోని మిషనరీలను మార్చాలంటే మాత్రం మొత్తం రూ.243 కోట్లు అవసరం అవుతుందని నివేదించారు. ప్రస్తుతం మొలాసీస్‌కు డిమాండ్ ఉండటం వల్ల చక్కెర, బెల్లంతో పాటు మొలాసీస్‌ను ఉత్పత్తి చేస్తే ఫ్యాక్టరీ లాభాల్లో నడిచే అవకాశం ఉందని ఆ నివేదికలో పేర్కొన్నారు. కాగా, నిజాం షుగర్ ఫ్యాక్టరీ బోధన్ పట్టణం నడుమ ఉండటం వల్ల దానిని ఇతర ప్రాంతాలకు షిఫ్ట్ చేయాలని అక్కడి ప్రజలు కోరుతున్నారు. బోధన్ శివారులో కానీ, ఇతర ప్రాంతానికి తరలిస్తే కాలుష్యం ఉండదని భావిస్తున్నారు.

ఒకే దేశం ఒకే ఎన్నిక అమలైతే దేశానికి లాభం



మాట్లాడుతున్న ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ

సుభాష్‌నగర్, మార్చి 16 (ఆంధ్రజ్యోతి): ఒకే దేశం ఒకే ఎన్నిక అమలైతే దేశానికి అనేక ప్రయోజనాలు కలుగుతాయని నిజామాబాద్ అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ అన్నారు. జిల్లా కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో జిల్లా అధ్యక్షుడు దినేష్‌కులాచారి అధ్యక్షతన ఆదివారం ఏర్పాటు చేసిన వన్ నేషన్ వన్ ఎలక్షన్ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. భారతదేశ అభివృద్ధి కోసం ప్రధానమంత్రి నరేంద్రమోదీ తీసుకుంటున్న సంస్కరణలో మరో చారిత్రాత్మకైన నిర్ణయం వన్ నేషన్ వన్ ఎలక్షన్ అన్నారు. దేశంలో సుమారు 65రాజకీయ పార్టీలు జమిలీఎన్నికలు జరపా లని ఆమోదం తెలపడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి పోతన్‌కర్ లక్ష్మినారాయణ, కంచెట్టి గంగాధర్, రాంచందర్, నాగొళ్ల లక్ష్మినారాయణ, మండల అధ్యక్షులు, తదితరులు పాల్గొన్నారు.

పెద్దమ్మ తల్లి ఆలయ నిర్మాణానికి భూమిపూజ



భూమిపూజ చేస్తున్న ముదిరాజ్ సంఘ సభ్యులు

ఆర్మూర్‌రూరల్, మార్చి16(ఆంధ్రజ్యోతి): ఆర్మూర్ పట్టణంలోని శ్రీపెద్దమ్మ తల్లి ఆలయం వద్ద నూతన ఆలయ నిర్మాణానికి ఆదివారం ముదిరాజ్ సంఘం పెద్దల సమక్షంలో భూమిపూజ నిర్వహించారు. వేధాంతం గోపికృష్ణశర్మ ఆధ్వర్యంలో వేదమంత్రోచ్చరణాల మధ్య గణపతి పూజ, గౌరిపూజ, అమ్మవారి పూజ, అమ్మవారి ప్రతిష్ఠాపనకు యంత్ర ప్రతిష్ఠాపన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు దంపతులు అభిషేకాలు నిర్వహించి పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో పెద్దమ్మ తల్లి ఆలయ కమిటీ చైర్మన్ గజం మచ్చేందర్, పెద్దబజార్ సంఘం అధ్యక్షుడు బోండ్ల సంతోష్, రాజారాంనగర్ సంఘ అధ్యక్షుడు ఈర్ల రవి, చైర్మన్ బోన సుమన్, జక్కం ప్రసాద్, బోండ్ల ఆనంద్, మందుల బాలు, ముదిరాజ్ సంఘ సభ్యులు, భక్తులు, తదితరులు పాల్గొన్నారు.

జాతీయ రహదారిపై రోడ్డు ప్రమాదం

● ఒకరు మృతి, పలువురికి గాయాలు



సంఘటన స్థలాన్ని పరిశీలిస్తున్న ఎస్‌హెచ్‌వో సత్యనారాయణ

ఆర్మూర్‌టౌన్‌మార్చి16(ఆంధ్రజ్యోతి):మున్సిపల్ పరిధిలోని పెర్కిట్ మహిళ ప్రాంగణం వద్ద 44వ జాతీయరహదారిపై శనివారం రాత్రి రోడ్డు ప్రమాదం జరగడంతో ఒకరు మృతి చెందగా పలువురికి గాయాలయ్యాయి. వివరాలు ఇలా ఉన్నాయి. రాత్రి ఉత్తరప్రదేశ్ రాష్ట్రానికి చెందిన ముగ్గురు యువకులు నిషాద్, మనిష్, కర్నాల్ భీమ్‌గల్ మండల కేంద్రంలో తమ పనిని ముగించుకొని నిర్మల్ వైపు ద్విచక్ర వాహనంపై వెళ్తుండగా వారి వెనుక నుంచి వచ్చిన కారు అతివేగంగా వచ్చి బైక్‌ను ఢీకొట్టింది. దీంతో బైక్‌పై ముగ్గురులోని ఒకరు నిషాద్ అక్కడికక్కడే మృతి చెందగా ఇద్దరికి తీవ్రగాయాలయ్యాయి. అలాగే బైక్‌ను ఢీకొన్న కారు ముందు అగి వున్న కంటై నర్‌ను ఢీకొనడంతో కారులో ఉన్న ఇద్దరికి గాయాలయ్యాయి. విషయం తెలుసుకున్న ఎస్ హెచ్‌వో సత్యనారాయణ పోలీస్ సిబ్బందితో సంఘటన స్థలానికి చేరుకోవడంతో సంఘ టన స్థలాన్ని పరిశీలించారు. గాయాలైన నలుగురిని అంబులెన్స్‌లో చికిత్స నిమిత్తం ప్రభు త్వ ఆసుపత్రికి తరలించారు. అనంతరం మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఆయన తెలిపారు.

హంగర్గలో ద్విచక్ర వాహనం చోరీ



చోరీకి గురైన ద్విచక్ర వాహనం

కోటగిరి,మార్చి16(ఆంధ్రజ్యోతి): పొతంగల్ మండలంలోని హంగర్గ గ్రామంలోని బీసీ కాలనీలో గంగాధర్ అనే వ్యక్తికి చెందిన ద్విచక్ర వాహనం చోరీకి గురైంది. తన కిరాణ షాపు ముందు ద్విచక్ర వాహనాన్ని నిలిపి ఉంచగా గుర్తు తెలియని వ్యక్తులు వాహనాన్ని దొంగలించారు. వాహనం కోసం పలు ప్రాంతాలలో వెతికిన దొరకకపోవడంతో బాధితులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ సందీప్ తెలిపారు.

యువకుడి ఆత్మహత్యాయత్నం

● కాపాడిన పోలీసులు

నవీపేట,మార్చి16(ఆంధ్రజ్యోతి): నిజామాబాద్‌లోని శివాజీనగర్ కాలనీకి చెందిన బుయ్యని వంశీకృష్ణ అనే యువకుడు ఆదివారం యంచ గోదావరిలో దూకి ఆత్మహత్యా యత్నానికి పాల్పడుతుండగా పోలీసులు అతనిని కాపాడారు. కుటుంబ తగదాలతో మధ్యాహ్నం సమయంలో యంచ గోదావరి బ్రిడ్జి మీద నడుచుకుంటూ వెళ్తూ నదిలో దూకడానికి యత్నించాడు ఇదే సమయంలో ఎస్‌ఐ వినయ్ బాసర వైపు వెళ్తుండగా అతనిని పట్టుకుని పోలీస్ స్టేషన్‌కు తరలించారు. అనంతరం అతనికి కౌన్సిలింగ్ ఇచ్చి తల్లిదండ్రులకు అప్పగించారు. ఇందులో హెడ్‌కానిస్టేబుల్ పరశురాం ఉన్నారు. తన కుమారుడి ప్రాణాలు కాపాడి తమకు అప్పగించిన పోలీసులకు తల్లిదండ్రులు కృతజ్ఞతలు తెలిపారు.

జాతీయస్థాయి కరాటేలో వెల్కటూర్ విద్యార్థులు

మెండోర, మార్చి16(ఆంధ్రజ్యోతి): జాతీయస్థాయి కరాటేలో వెల్కటూర్ ఓపాఠశాల విద్యార్థులు ఉత్తమ ప్రతిభ కనబరిచి పలు విభాగాల్లో బంగారు పతకాలు సాధించారని పాఠశాల కరస్పాండెంట్ అజ్మత్‌పాషా సంతోషం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా హైదరాబాద్‌లో జరిగిన మూడో జాతీయస్థాయి కరాటే ఛాంపియన్‌షిప్ పోటీల్లో 26మంది విద్యార్థులు పాల్గొన్నారు. కటాస్ విభాగంలో అండర్ -12 విభాగంలో 12 బంగారు పతకాలు, ఐదు కాంస్య పతకాలు సాధించారు. అండర్-10 విభాగంలో నాలుగు బంగారు పతకాలు సాధించారు. అండర్-8 విభాగంలో రెండు బంగారు పతకాలు సాధించారు. పలు విభాగాల్లో పతకాలు సాధించిన విద్యార్థులకు రాష్ట్ర జెకెఎస్ చీఫ్ ఇన్స్‌పెక్టర్ ఎండి.పాషా, స్టేట్ జాయింట్ సెక్రెటరీ పసునూరి అవినాష్, నిజామాబాద్ జిల్లా చీఫ్ ఇన్‌స్పెక్టర్ జోగు శివాణి చేతుల మీదుగా పతకాలు, ప్రశంసపత్రాలు అందజేశారు. పలు విభాగాల్లో బంగారు పతకాలు విద్యార్థులు సాధించడంతో మండల ప్రజలు హర్షం వ్యక్తం చేశారు.



నగరంలో దిష్టిబొమ్మలను దహనం చేస్తున్న కాంగ్రెస్ నాయకులు



నందిపేటలో..



ఆర్మూర్‌లో దిష్టిబొమ్మ దహనం చేస్తున్న కాంగ్రెస్ నాయకులు

జగదీశ్‌రెడ్డి, కేటీఆర్‌ల దిష్టిబొమ్మల దహనం

నిజామాబాద్ అర్బన్, మార్చి 16 (ఆంధ్రజ్యోతి):అసెంబ్లీలో దళిత స్పీకర్ గడ్డం ప్రసాద్‌పై బీఆర్ఎస్ ఎమ్మెల్యే జగదీశ్‌రెడ్డి చేసిన వ్యాఖ్యలను ఖండిస్తూ రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ పిలుపు మేరకు ఆదివారం నగరంలోని ఎన్టీఆర్ చౌరస్తాలో జిల్లా కాంగ్రెస్, నగరకాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో దిష్టిబొమ్మలను దహనం చేశారు.అనుచిత వ్యాఖ్యలు చేసిన ఎమ్మెల్యే జగదీశ్‌రెడ్డితో పాటు ఆ వ్యాఖ్యలను సమర్థించిన మాజీ మంత్రి కేటీఆర్ దిష్టిబొమ్మలను దహనం చేశారు. ఈ సందర్భంగా జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు మానాల మోహన్‌రెడ్డి మాట్లాడుతూ గతంలో బీఆర్ఎస్ అధికారంలో ఉండగా కేసీఆర్ దళితులను, గిరిజనులను అవమానించేలా వ్యవహరించారని ప్రస్తుతం అసెంబ్లీలో కేటీఆర్ భరితెగించి తన ఎమ్మెల్యేలతో కలిసి దళిత స్పీకర్ గడ్డం ప్రసాద్‌పై అనుచిత వ్యాఖ్యలు చేయడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నా మన్నారు. మునుముందు ఇలాంటి వ్యాఖ్యలు చేస్తే తప్పకుండా గుణపాఠం చెబుతామని దళితులు, గిరిజనులు మీ అంతు చూస్తారని అన్నారు. గత 14 నెలలుగా అధికారం పోయిన తర్వాత కేటీఆర్ మాట్లాడుతున్న మాటలు అందరిని అవమానించేలా ఉన్నా యని ఇది దొర అహంకారానికి నిదర్శనమన్నారు.ఈకార్యక్రమంలో ఉర్దూ అకాడమి చైర్మన్ తాహెర్‌బిన్ హుందాన్, నుడా చైర్మన్ కేశవేణు, గ్రంథాలయ చైర్మన్ అంతిరెడ్డి రాజరెడ్డి,నాయకులు రత్నాకర్, రాంభూపాల్, రామర్తిగోపి, వేణురాజ్, కేతావత్ యాదగిరి,శ్రీనివాస్,వినయ్, ఉషా, విజయలక్ష్మి, అపర్ణ, తదితరులు పాల్గొన్నారు.

మోస్రా: నిజామాబాద్-బాన్సువాడ ప్రధాన రహదారిపై మోస్రా మండల కేంద్రంలో స్పీకర్‌పై అనుచిత వ్యాఖ్యలు చేసిన మాజీమంత్రి జగదీష్ రెడ్డి దిష్టిబొమ్మను మండల కాంగ్రెస్ నాయకులు దహనం చేశారు. స్పీకర్‌పై మాజీ మంత్రి జగదీష్ రెడ్డి అనుచిత వ్యాఖ్యలు చేయడాన్ని తీవ్రంగా ఖండించారు. ఈ కార్యక్రమంలో మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు కొత్తిమీర్‌కర్ లక్ష్మణ్, కిసాన్ ఖేత్ మండల అధ్యక్షుడు తోటరాజు, సీనియర్ నాయకులు హరినారాయణ,చింతకుంట మాజీసర్పంచ్ విమల లింగయ్య, ఎస్సీ సెల్ మండల అధ్యక్షుడు సంగం సాయిలు, యూత్ కాంగ్రెస్ మండల మాజీ అధ్యక్షుడు గుండు శ్రీకాంత్, బీసీసెల్ జిల్లాకార్యదర్శి అశోక్,తిమ్మాపూర్ నానుసాయిలు, బాలయ్య, రాములు, సాయిలు, నర్సయ్య, మోహన్, చింటు తదితరులు పాల్గొన్నారు.

కోటగిరి: పొతంగల్ మండల కేంద్రంలో కాంగ్రెస్ నాయకులు ఆదివారం మాజీమంత్రి జగదీష్‌రెడ్డి దిష్టిబొమ్మను దహనం చేశారు. రాష్ట్ర శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్‌పై మాజీమంత్రి అనుచిత వ్యాఖ్యలు చేయడంపై తీవ్ర నిరసన వ్యక్తం చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం చేసే అభివృద్ధి కార్యక్రమాలను ఓర్వలేక బీఆర్ఎస్ నాయకులు ప్రభుత్వంపై నిందలు వేస్తున్నారని ఆరోపించారు. జగదీష్‌రెడ్డి సభ్యత్వాన్ని రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ హన్మంతు, కాంగ్రెస్ నాయకులు రాజు, ఏజాజ్ ఖాన్, దత్తు, మన్సూర్, చాంద్ పాషా, నబీ, ధన్‌రాజ్ తదితరులు పాల్గొన్నారు.

● రుద్రూరులో కేటీఆర్, జగదీష్ రెడ్డి దిష్టిబొమ్మల దహనం

కోటగిరి: రాష్ట్ర శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్‌పై బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు, మాజీమంత్రులు అనుచిత వ్యాఖ్యలు చేయడంపై మండల కాంగ్రెస్ నాయకులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. రుద్రూరు మండల కేంద్రంలో ఆదివారం మాజీమంత్రులు కేటీఆర్, జగదీష్ రెడ్డి దిష్టిబొమ్మను దగ్ధం చేశారు. స్పీకర్‌పై అనుచిత వ్యాఖ్యలు చేయడం సరైన పద్ధతి కాదని పేర్కొన్నారు. మరోసారి అనుచిత వ్యాఖ్యలు చేస్తే సహించేది లేదని పేర్కొన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం చేసే అభివృద్ధి కార్యక్రమాలను ఓర్వలేకపోతున్నారని అన్నారు. స్పీకర్‌పై అనుచిత వ్యాఖ్యలు చేయడం సరికాదన్నారు. ఇప్పటికైనా బీఆర్ఎస్ నాయకులు కళ్లు తెరవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు చంద్రశేఖర్, నారోజి గంగారాం, అరుణ్ కుమార్, పార్వతి ప్రవీణ్, సంజీవ రెడ్డి, సంగయ్య, అశోక్, సుదర్శన్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

ఆర్మూర్‌రూరల్: మండల కేంద్రంలోని జాతీయరహదారిపై ఆదివారం మాజీ సీఎం కేసీఆర్, మాజీమంత్రి జగదీశ్వర్‌రెడ్డిల దిష్టిబొమ్మలను కాంగ్రెస్ నాయకులు దహనం చేశారు. గత గురువారం అసెంబ్లీ సమావేశంలో స్పీకర్ గడ్డం ప్రసాద్‌ను ఏకవచనంతో సభ నీ సొంతం కాదు మాట్లాడి అగౌరపరిచిన సూర్యాపేట ఎమ్మెల్యే జగదీశ్వర్‌రెడ్డి శాసన సభ సభ్యత్వాన్ని రద్దు చేయాలని నినాదాలు చేశారు. అనంతరం జాతీయరహదారిపై దిష్టిబొమ్మను దహనం చేశారు. మొదటి నుంచి కేసీఆర్ పార్టీ విధానమే బలహీనవర్గాలను అవమానపరుస్తూనే ఉన్నారని, దళిత, బహుజనులు అంటే ఇంత అసహనం ఎందుకని కాంగ్రెస్ నాయకులు అన్నారు. మూడు సార్లు ఎమ్మెల్యేగా గెలిచిన జగదీశ్వర్‌రెడ్డికి శాసనసభను, స్పీకర్ స్థానాన్ని గౌరవించడం తెలియదా అని అన్నారు. ఈ కార్యక్రమంలో పీసీసీ అధికార ప్రతినిధి పాత వేణుగోపాల్, మండల పార్టీ అధ్యక్షుడు ముత్యాల రాములు, మండల యూత్ కాంగ్రెస్ ప్రెసిడెంట్ అడ్వాల మనోజ్, గడ్డం అనిల్, ఎఎంసీ డైరెక్టర్‌లు మహిపాల్, లక్ష్మరంజిత్, నవీద్, గిర్మాజీగోపి, చిన్న గంగారాం, ఆనంద్, హర్షద్‌లు పాల్గొన్నారు.

ముప్కాల్: అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్‌పై అనుచిత వ్యాఖ్యలు చేసిన బీఆర్ఎస్ పార్టీ ఎమ్మెల్యే జగదీశ్వర్‌రెడ్డి, అతనిని సమర్థించిన కేటీఆర్ దిష్టిబొమ్మను ఆదివారం ముప్కాల్ మండల కేంద్రంలో కాంగ్రెస్ నాయకులు దహనం చేశారు. స్పీకర్ స్థానాన్ని అగౌరవపరిచిన బీఆర్ఎస్ పార్టీ నాయకుల పై వ్యతిరేక నినాదాలు చేస్తూ దిష్టిబొమ్మను దహనం చేశారు. ఈ కార్యక్రమంలో ముప్కాల్ మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు మగ్గిడి ముత్యంరెడ్డి, జిల్లా కాంగ్రెస్ కమిటీ కార్యదర్శి, వేల్పూర్ మార్కెట్ కమిటీ డైరెక్టర్ జైడి చందరవి, కొమ్ముల శ్రీనివాస్, ముస్కు ముత్తెన్న, విజయ్, రాములు, ప్రతాప్, శ్రీకాంత్, మహేష్, రవి, తదితరులు పాల్గొన్నారు.

ఆర్మూర్‌రూరల్: ఆర్మూర్ పట్టణంలోని అంబేద్కర్‌చౌరస్తాలో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ఆదివారం మాజీమంత్రులు కేటీఆర్, జగదీశ్వర్‌రెడ్డిల దిష్టిబొమ్మలను దహనం చేశారు. ఇటీవల దళిత నాయకుల పట్ల బీఆర్ఎస్ వైఖరిని వారు ఖండించారు. అసెంబ్లీలో స్పీకర్ ప్రసాద్‌కుమార్ పట్ల ఎమ్మెల్యే జగదీశ్వర్‌రెడ్డి ఏకవచనంతో మాట్లాడి సభ మర్యాద మంట కలిపారని వారు ఆగ్రహం వ్యక్తం చేశారు. తమ పార్టీ నాయకుల పట్ల అగౌరవంగా మాట్లాడితే సహించేదిలేదని వారు స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ సాయిబాబాగౌడ్, కాంగ్రెస్ నాయకులు లింగాగౌడ్, అయ్యప్ప శ్రీనివాస్, వాసు, జిమ్మి రవి, పయాం, కొక్కెర భూమన్న, లింబాద్రి, బబ్లు, నారాయణ, ప్రవీణ్, తదితరులు పాల్గొన్నారు.

నంది పేట: మండల కేంద్రంలో ఆదివారం మాజీ ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖర్ రావు, మాజీ మంత్రి జగదీశ్వర్ రెడ్డి దిష్టిబొమ్మలను కాంగ్రెస్ పార్టీ నాయకులు దహనం చేశారు. అసెంబ్లీలో స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్‌పై అనుచిత వ్యాఖ్యలు చేసినందుకు నిరసనగా దిష్టిబొమ్మలు దహనం చేశారు.



ముప్కాల్‌లో..



మోస్రాలో ..



మాక్లూర్‌లో..

ప్రతిపక్ష నాయకులు చేసిన వ్యాఖ్యలను తీవ్రంగా ఖండించారు. స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్‌కు మాజీ సీఎం కేసీఆర్, మాజీ మంత్రి జగదీశ్వర్ రెడ్డిలు బహిరంగ క్షమాపణలు చెప్పాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు మంద మహిపాల్, ఏఎంసీ డైరెక్టర్ పెంట ఇంద్రుడు తదితరులు ఉన్నారు.

మాక్లూర్: మండల కేంద్రంలోని తెలంగాణ స్పీకర్ గడ్డం ప్రసాద్‌పై అనుచిత వ్యాఖ్యలకు నిరసనగా ఆర్మూర్ అసెంబ్లీ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి వినయ్‌కుమార్‌రెడ్డి ఆదేశాల మేరకు ఆదివారం నిరసన కార్యక్రమం నిర్వహించారు. స్పీకర్ గడ్డం ప్రసాద్‌పై బీఆర్ఎస్ ఎమ్మెల్యే జగదీశ్వర్‌రెడ్డి మాట్లాడిన అనుచిత వ్యాఖ్యలకు నిరసనగా కాంగ్రెస్ నాయకులు జగదీశ్వరెడ్డి దిష్టిబొమ్మను దహనం చేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు నవీన్, మార్కెట్ కమిటీ డైరెక్టర్ వెంకటేశ్వర్‌రావు, సొసైటీ చైర్మన్ అశోక్, నాయకులు వినోద్, పరశురాం, సందీప్, తదితరులు పాల్గొన్నారు.

ఆశావర్కర్లకు ప్రభుత్వం ఇచ్చిన మాట నిలబెట్టుకోవాలి



మాట్లాడుతున్న నూర్జహాన్

ఖిల్లా, మార్చి 16 (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ సర్కార్ ఆశావర్కర్లకు ఇచ్చిన మాటను నిలబెట్టుకోవాలని అసెంబ్లీ బడ్జెట్ సమావేశంలో ఆశలకు రాష్ట్ర ప్రభుత్వం 18వేలు ఫిక్స్‌డ్ వేతనం నిర్ణయించాలని సీఐటీయు జిల్లా కార్యదర్శి నూర్జహాన్ అన్నారు. జిల్లా కేంద్రంలోని సీఐటీయు జిల్లా కార్యాలయంలో ఆశావర్కర్లతో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఆశా వర్కర్ల సమస్యల పరిష్కారానికి ఈనెల 19న కలెక్టరేట్ కార్యాలయం ఎదుట ధర్నాను నిర్వహిస్తున్నట్లు ఆమె చెప్పారు. ఈ ధర్నా కార్యక్రమంలో జిల్లా వ్యాప్తంగా ఉన్న ఆశావర్కర్లందరూ పాల్గొని విజయవంతం చేయాలని ఆమె కోరారు. ప్రభుత్వం ఆశావర్కర్ల సమస్యల పట్ల నిర్లక్ష్యం వహిస్తుందని అన్నారు. బీఆర్ఎస్ పార్టీ కంటే కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తే మెరుగైన సౌకర్యాలు కల్పిస్తుందని, ఆశలకు వేతనాలు పెంచడంతో పాటు ఉద్యోగ భద్రత కల్పిస్తామని కాంగ్రెస్ తన మేనిఫెస్టోలో పొందుపర్చిన విషయాన్ని గుర్తు చేశారు. ఆశావర్కర్ల ఓట్లతో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిందన్నారు. ఆశావర్కర్ల సమస్యలు మాత్రం నేటికి పరిష్కారానికి నోచుకోలేదన్నారు. ఈ కార్యక్రమంలో సుఖన్య, రేణుక, స్వప్న, రాధా, శోభ, గంగామణి, లలిత, తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ఇఫ్తార్ విందు



ఏర్గట్లలో ఇఫ్తార్ విందులో ముస్లింలతో మాట్లాడుతున్న కాంగ్రెస్ నాయకులు

ఏర్గట్ల, మార్చి 16 (ఆంధ్రజ్యోతి) : పవిత్ర రంజాన్ మాసాన్ని పురస్కరించుకొని కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ఆదివారం సాయంత్రం ఏర్గట్ల మండల కేంద్రంలో ఇఫ్తార్ విందును ఏర్పాటు చేశారు. కాంగ్రెస్ పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు శివన్నోళ్ల శివకుమార్, మండల పార్టీ అధ్యక్షుడు సోమ దేవరెడ్డితో పాటు కాంగ్రెస్ నాయకులు హాజరై మైనార్టీ సోదరులతో కలిసి ఇఫ్తార్ విందులో పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గత ఇరవై ఏళ్ళుగా ముస్లీం సోదరులకు ఇఫ్తార్ విందును ఏర్పాటు చేస్తున్నామని, రంజాన్ ఇఫ్తార్ విందులు మత సామరస్యానికి ప్రతీకగా నిలుస్తాయని, సోదరభావాన్ని పెంపొందిస్తాయని అన్నారు. ఈ కార్యక్రమంలో కమ్మర్‌పల్లిమార్కెట్ కమిటీ డైరెక్టర్ కొరిపెల్లి లింగారెడ్డి, గడ్డం జీవన్, పన్నాల నర్సారెడ్డి, కౌడ పెద్ద భూమేష్, జింక అనిల్, బెజ్జారపు భాను, మండలంలో కాంగ్రెస్ నాయకులు, మైనార్టీలు పాల్గొన్నారు.

దేశ సైనికుల గ్రామం అడవి మామిడిపల్లి

● ఆర్మీలో చేరి దేశసేవ చేస్తున్న యువకులు

ఆర్మూర్‌రూరల్, మార్చి16(ఆంధ్రజ్యోతి): సరిహద్దు సేవంటే సాహసమే. దేశ భద్రత నా బాధ్యత అంటు దేశరక్షణలో పాలుపంచుకుంటున్నారు అడవి మామిడిపల్లి యువకులు బార్డర్‌లో సైనికులుగా ఉంటూ భారత్‌కు రక్షణగా నిలుస్తూ దేశభక్తిని నిరుపించుకుంటున్నారు. మాక్లూర్ మండలంలోని అడవిమామిడిపల్లి నిజామాబాద్, ఆర్మూర్ మార్గంలోని 63వ జాతీయరహదారిపై ఉంది. ఆ గ్రామ యువకులు ఇంటర్ పూర్తి కాగానే దేశరక్షణకు నడుం బిగించి ఆర్మీలో చేరుతున్నారు.

తెలుగులో విస్తృతంగా సాహిత్య సృజన జరగాలి

● ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత

సుభాష్‌నగర్, మార్చి 16 (ఆంధ్రజ్యోతి):మన తెలుగు భాషా మనకు గర్వకారణం అని తెలంగాణ భాషను ముందు తరాలకు అందించడం ధ్యేయం కావాలని ఎమ్మెల్సీ తెలంగాణ జాగృతి రాష్ట్ర అధ్యక్షురాలు కల్వ కుంట్ల కవిత అన్నారు. హైదరాబాద్‌లోని ఆమె స్వగృహంలో హరిదా రచయితల సంఘం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న తెలంగాణ భాషలో కవితలు, కథల పోటీలకు సంబంధించిన పోస్టర్లను ఆదివారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ కవిత మాట్లాడుతూ తెలంగాణ భాషలో రాసే కవితలు కథలతో మనుగడలోలేని తెలంగాణ పదాలు సామెతలు నుడికా రాలు వెలుగులోకి వచ్చి తెలంగాణ అస్థిత్వం ఘనంగా నిలబడుతుందని ఆకాంక్షించారు. అంతర్జాతీయ స్థాయిలో ప్రపంచంలో ఎక్కడ నివసిస్తున్నా తెలంగాణ భాషలో కవితలు, కథలు రాసేవారికి ఇది గొప్ప అవకాశం అన్నారు. ఈ కార్యక్రమాన్ని తలపెట్టిన హరిదా రచయితల సంఘాన్ని అభి నందించారు. ఉత్తమ కవితలు, కథలను పంపించి కవులు, రచయితలు పోటీని విజయవంతం చేయాలన్నారు. అనంతరం హరిదా రచయితల సంఘం అధ్యక్షుడు ఘనపురం దేవేందర్ మాట్లాడుతూ తెలంగాణ భాషలో కవితలు, కథలు రాసి మే 30వ తేదీలోపు హరిదా సరస్వతీరాజ్ ఎట్‌దిరేట్‌జి మెయిల్‌కు పంపాలని మిగతా వివరాల కోసం 9948032705 నెంబర్‌ను సంప్రదించాలని కోరారు. ఈ కార్యక్రమంలో హరిదారచయితల సంఘం అధికార ప్రతినిధి నరాల సుధాకర్, తెలంగాణ జాగృతి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నవీన్ ఆచారి, రామ్‌స్మృతిక, తదితరులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబాలకు పరామర్శ

భీమ్‌గల్‌రూరల్, మార్చి16(ఆంధ్రజ్యోతి): మండలంలోని చేంగాల్ గ్రామంలో ఆదివారం బాల్కొండ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జీ ముత్యాల సునీల్‌కుమార్ పలు బాధిత కుటుంబలను పరామర్శించారు. కాంగ్రెస్ నాయకుడు వసంత్‌రెడ్డి వాళ్ల నాన్న ఇటీవల అనారోగ్యంతో చనిపోయాడు. సంగెం శారద ఇటీవల మరణించారు. వారి కుటుంబాలను పరామర్శించి సంతాపాన్ని వ్యక్తం చేశారు. ఆయన వెంట మండల కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, తదితరులు ఉన్నారు.

కమ్మర్‌పల్లి:ఇటీవల రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడినిన కమ్మర్‌పల్లికి చెందిన అనిల్‌ను ఆదివారం బాల్కొండ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి ముత్యాల సునీల్‌కుమార్ పరామర్శించారు. ప్రమాద వివరాలతో పాటు, ఆరోగ్య స్థితిని బాధితుడు అనిల్‌ని అడిగి తెలుసుకున్నారు. ఆయన వెంట కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు సుంకెట రవి, కమ్మర్‌పల్లి వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ పాలెపు నర్సయ్య, కాంగ్రెస్ నాయకులు అజ్మత్ పాష, అజహారోద్దీన్. స్థానికులు అజయ్ తదితులు ఉన్నారు.

మోర్తాడ్: మోర్తాడ్ మండలంలోని పాలెం, దొన్‌పాల్ గ్రామాలలో బాధిత కుటుంబాలను బాల్కొండ నియోజకవర్గ కాం గ్రెస్ పార్టీ ఇన్‌చార్జీ ముత్యాల సునీల్‌కుమార్ పరామర్శించారు. పాలెం గ్రామానికి చెందిన కొత్తపల్లి నర్సారెడ్డివారి అత్తమ్మ ఇటీవల అనారోగ్యంతో మరణించడంతో వారి కుటుంబాన్ని ఆదివారం పరామర్శించారు. అదే గ్రామానికి చెందిన టీచర్ రాజేం దర్ అనారోగ్యంతో మరణించడంతో వారి కుటుంబసభ్యులను కూడా సునీల్ కుమార్ పరామర్శించారు. దొన్‌పాల్ గ్రామానికి చెందిన సంజీవరెడ్డి అమ్మ ఇటీవల అనారోగ్యంతో మరణించారు. వారి కుటుంబాన్ని పరామర్శించి మృతురాలి చిత్రపటానికి నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో మండల కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



చేంగల్‌లో బాధిత కుటుంబాన్ని పరామర్శిస్తున్న సునీల్‌కుమార్

షాపూర్‌లో తపోవన ఆశ్రమం ప్రారంభం



షాపూర్‌లో మహరాజ్‌లకు పాదపూజ చేస్తున్న గ్రామస్థులు

నందిపేట, మార్చి 16 (ఆంధ్రజ్యోతి): మండలంలోని షాపూర్ గ్రామంలో ఆదివారం తపోవన ఆశ్రమాన్ని వివిధ ఆశ్రమాలకు చెందిన మహరాజు ప్రారంభించారు. ముందుగా శివానంద భారతీ స్వామిచే ప్రణవ పతావిష్కరణ, శ్రీ కేదారేశ్వర ఆశ్రమం వ్యస్థాపకులు శ్రీ మంగి రాములు మహరాజ్ జ్యోతి ప్రజ్వలన చేశారు. అనంతరం బాద్గుణ గంగారెడ్డి, ఫతేపూర్ గంగారెడ్డి ఆధ్వర్యంలో గీతా పారాయణం, విష్ణు సహస్ర నామం, శ్రీరామ రక్ష స్తోత్రములు నిర్వహించారు. అనంతరం అన్నదానం చేశారు. ఈ కార్యక్రమంలో బ్రాహ్మేశ్వర్ బాలానంద స్వామి, ప్రకాశం జిల్లాలోని సింగరకొండ శాంతానంద మాతాజీ, కలిగోట శబరి మాత ఆశ్రమం బ్రహ్మానంద మహరాజ్, వేల్పూర్ నారద ఆశ్రమ దశరత మహరాజ్, డొంకేశ్వర్ సదానంద మహరాజ్, గ్రామాభివృద్ధి కమిటీ సభ్యులు తదితరులు ఉన్నారు.

ఆకుల లలిత ఫౌండేషన్ ద్వారా ఉద్యోగాలు



అభ్యర్థులతో మాజీ ఎమ్మెల్సీ ఆకుల లలిత

నిజామాబాద్‌అర్బన్, మార్చి 16 (ఆంధ్రజ్యోతి): మాజీ ఎమ్మెల్సీ ఆకుల లలిత రాఘవేందర్ ఫౌండేషన్ ద్వారా ఈ నెల 12న నిర్వహించిన ఎన్ఎంసీ కంపెనీ జాబ్ మేళాలో ఇంటర్వ్యూ ద్వారా ఎంపికైన యువతీ యువకులకు ఆదివారం హైదరాబాద్‌కు పంపించారు. మొత్తం 98 మంది యువతీ యువకులు ఇంటర్వ్యూలో పాల్గొనగా 42 మందికి మొదటి విడతగా ఫాక్స్ కాన్సే కంపెనీలో ఉద్యోగాలకు ఎంపికైనట్లు మాజీ ఎమ్మెల్సీ ఆకుల లలిత తెలిపారు. తమ ఫౌండేషన్ ద్వారా యువతీ యువకులకు శిక్షణ ఇవ్వడంతో పాటు ఉద్యోగ అవకాశాలు కల్పిస్తున్నట్లు తెలిపారు. ఈ మేరకు ఆమె స్వయంగా యువతీ యువకులను బస్సులో హైదరాబాద్‌కు తీసుకెళ్లారు.

టీయూకి ఈశ్వరీబాయి పేరు పెట్టడం హర్షనీయం



వివరాలు వెల్లడిస్తున్న ప్రతినిధులు

ఖిల్లా,మార్చి 16(ఆంధ్రజ్యోతి):తెలంగాణా విశ్వవిద్యాలయానికి ఈశ్వరీబాయి పేరు ప్రకటించడం హర్షనీయమని సీనియర్ దళిత నాయకులు, సామాజిక ఉద్యమకర్త బంగారుసాయిలు అన్నారు. జిల్లా కేంద్రంలోని ఆర్ అండ్‌బీ అతిథిగృహంలో ఆదివారం విలేకరులతో మాట్లాడుతూ రాష్ట్ర చరిత్ర తెలియని కొందరు విశ్వవిద్యాలయానికి ఈశ్వరీబాయి పేరు పెట్టడాన్ని వ్యతిరేకించడం వారి అజ్ఞానాన్ని సూచిస్తుందని ఆయన మండిపడ్డారు. సామాన్య దళిత కుటుంబంలో పుట్టిన ఈశ్వరీబాయి అంచెలంచేలుగా ఎదిగి దళిత జాతిని చైతన్యపర్చిన గొప్ప మహ్మాతురాలని అన్నారు. తెలంగాణా ఉద్యమకారునిగా అసెంబ్లీని గడగడలాడించిన ఆదిశక్తి ఈశ్వరీబాయి అని పేర్కొన్నారు. ఈ సమావేశంలో మాలమహానాడు ప్రతినిధులు సక్కి విజయ్‌కు మార్, కేష్‌పల్లి రవి, చంద్రశేఖర్, సంతోష్, రత్నాకర్, రమేష్, పాల్గొన్నారు.

ఫటా..ఫట్...

మాదక ద్రవ్యాలకు యువత బానిస కావద్దు

● యాదగిరి గౌడ్, మోపాల్ ఎస్సై



ఆంధ్రజ్యోతి: గ్రామీణ యువత మాదక ద్రవ్యాలకు బానిసలు కాకుండా ఎలాంటి చర్యలు తీసుకుంటున్నారు?

ఎస్సై: గ్రామీణ యువత మాదక ద్రవ్యాలకు బానిసలు కాకుండా ఉండేందుకు గ్రామీణ యువకులకు అవగాహన సదస్సులను ఏర్పాటు చేస్తున్నాం. మాదక ద్రవ్యాలు తాగడం వల్ల ఎదురయ్యే ఇబ్బందులను వారికి వివరిస్తున్నాం. వీటికి బానిస కాకుండా ఉండేందుకు అన్ని జాగ్రత్తలు చేపడుతున్నామని తెలిపారు.

ఆంధ్రజ్యోతి: మీ పోలీస్ స్టేషన్ పరిధిలో ఎన్ని గ్రామ పంచాయతీలు ఉన్నాయి?

ఎస్సై: పోలీస్ స్టేషన్ పరిధిలో 21 గ్రామ పంచాయతీలు ఉన్నాయి.

ఆంధ్రజ్యోతి: అన్ని గ్రామాల్లో సీసీ కెమెరాలు ఉన్నాయా?

ఎస్సై: అన్ని గ్రామాల్లో సీసీ కెమెరాలను ఏర్పాటు చేశాం. కాని కొన్ని గ్రామాల్లో సరిగ్గా నడవడం లేదు.

ఆంధ్రజ్యోతి: దొంగతనాల నివారణకు ఎలాంటి చర్యలు తీసుకుంటున్నారు? పోలీస్ స్టేషన్‌లో సరిపడా సిబ్బంది ఉన్నారా?

ఎస్సై: దొంగతనాల నివారణకు రాత్రివేళల్లో విస్తృతంగా పెట్రోలింగ్ జరుపుతున్నాం. ప్రస్తుతం పోలీస్ స్టేషన్‌లో సరిపడా సిబ్బంది లేకున్నా అన్ని గ్రామాల్లో పెట్రోలింగ్‌ను చేస్తున్నాం.

ఆంధ్రజ్యోతి: వాహనాల తనిఖీ చేపడుతున్నారా? మద్యం సేవించి నడిపే వారిపై ఎలాంటి చర్యలు తీసుకుంటున్నారు?

ఎస్సై: వాహనాల తనిఖీలు వారంలో రెండు లేదా మూడు రోజులు నిర్వహిస్తున్నాం. మద్యం నడిపి వాహనం నడిపితే వారిపై చర్యలు కూడా తీసుకుంటున్నాం. హెల్మెట్, లైసెన్స్ లేకుండా వాహనాలు నడిపితే వారిపై చట్టరిత్య చర్యలు తీసుకుంటున్నాం.

ఆంధ్రజ్యోతి: మండలంలో మొరం, ఇసుక దందా జోరుగా నడుస్తుందని ఆయా గ్రామాల ప్రజలు ఆరోపిస్తున్నారు?

ఎస్సై: మండలంలో మొరం, ఇసుక దందా జరుగకుండా ఉండేందుకు కట్టుదిట్టమైన చర్యలను తీసుకుంటున్నాం. ఎవరైనా మొరం, ఇసుకను అక్రమంగా తరలిస్తే వారిపై చర్యలు తీసుకుంటున్నాం. ఈ రెండింటి దానిపై ఉక్కుపాదం మోపాలని ఉన్నతాధికారులు ఆదేశించినట్లు తెలిపారు.

ఆంధ్రజ్యోతి: మండలంలోని కొన్ని గ్రామాల్లో జూదం నడుస్తున్నట్లు సమాచారం?

ఎస్సై: మండలంలో జూదం నడవకుండా చర్యలు తీసుకుంటున్నాం. తమకు తెలియకుండా ఎవరైనా జూదం ఆడినట్లు తెలిస్తే వారిపై దాడి చేసి చర్యలు తీసుకుంటున్నాం. ఇప్పటికే అనేక మందిపై కేసులు కూడా పెట్టడం జరిగింది.

ఆంధ్రజ్యోతి: సైబర్ నేరగాళ్ల చేతిలో గ్రామీణ ప్రజలు మోసపోతున్నారు వారిపై ఎలాంటి చర్యలు తీసుకుంటున్నారు?

ఎస్సై: సైబర్ నేరగాళ్ల చేతిలో మోసపోకుండా ఉండేందుకు గ్రామ పంచాయతీ ఆవరణలో సదస్సులను ఏర్పాటు చేసి సైబర్ నేరగాలు చేస్తున్న మోసాలపై అవగాహన కల్పిస్తున్నాం. వారి చేతిల్లో ఎవరూ మోసపోవద్దని కోరారు. అటువంటి వారు ఎవరైనా ఫోన్ చేస్తే తమకు సమాచారం ఇవ్వాలి.

● (మోపాల్, ఆంధ్రజ్యోతి)



జాతీయ రహదారి ఇదే



సర్వీస్ రోడ్డులో రాత్రుల్లో వాహనం నిలిపిన దృశ్యం



కుడి పక్కన ఉన్న దాబాకు విశాలంగా ఇన్ అవుట్ రహదారులు ఇచ్చిన దృశ్యం

ఆంధ్రజ్యోతి ఫోకస్

ఎన్‌హెచ్‌ఏఐ
అధికారుల ఇష్టారాజ్యం



ఆరేడు బస్టాండ్ ఇదే

● రాత్రి వేళల్లో సర్వీస్ రోడ్ల వెంట వాహనాల పార్కింగ్ ● చైన్ నెంబర్ 78, 79ల వద్ద ఎన్‌హెచ్‌ఏఐ బౌండరీల ఆక్రమణ
● సంగారెడ్డి, కామారెడ్డి సరిహద్దులో పోలీసుల అత్యుత్సాహం ● ఈ రహదారి అంటేనే భయం భయం

నిజాంసాగర్, మార్చి 16 (ఆంధ్రజ్యోతి): 161 జాతీయ రహదారి అంటేనే వాహనదారులకు ప్రజలకు భయం పుట్టుకొస్తుంది. దీంతో ఎన్ఏహెచ్ఐ అధికారులు పట్టింపు లేనట్టుగా వ్యవహరిస్తున్నారు. ఈ రహదారి వెంట బస్టాండ్‌లో సర్వీసు రోడ్లలో వాహనదారులు రాత్రి వేళలో ఇష్టారాజ్యంగా వాహనాలు నిలుపుతూ ఉండడంతో రహదారి వెంట వెళ్లే వాహనదారులు ద్విచక్ర వాహనాలు అనేక పాట్లు పడుతున్నారు. కానీ ఎన్‌హెచ్‌ఎఐ అధికారులు పోలీసులు తమకేమీ పట్టనట్లుగా వ్యవహరిస్తున్నారని ఆరోపణలు వినిపిస్తున్నాయి. జిల్లా సరిహద్దులోని నిజాంసాగర్ మండలం ఆరేడు బస్ స్టేషన్ సమీపంలో ఇరుపక్కల గుజరాత్, హర్యానా దాబాలు వెలిసాయి. ఎన్‌హెచ్‌ఎఐ అధికారులు 161 రహదారి బౌండరీలను 2017లోని గుర్తించి ఆ రహదారి నిర్మాణం చేపట్టారు. చైన్ నెంబర్ 78, 79లో కామారెడ్డి జిల్లా నిజాంసాగర్ మండలం ఆరేడు బస్టాండ్లను ఏర్పాటు చేశారు. ఈ బస్ స్టేషన్ సమీపంలో జాతీయ రహదారికి ఎదురు ఎదురుగా రెండేసి దాబాలు ఏర్పాటు చేశారు. ఎన్‌హెచ్ఎఐ అధికారులు ఆరేడు బస్టాప్ వద్ద ఉన్న ఇరుపక్కల ఉన్న దాబా యజమానులతో అధికారులు, పోలీసులు కుమ్ముక్కై ఎడమ పక్కన ఉన్న దాబాకు రెండు చోట్ల ఇన్, అవుట్ ప్రవేశాలకు రోడ్డును వదిలారు. ఇదే బస్టాండ్ కుడి వైపు మరో దాబా ఉండడంతో కేవలం ఒకేచోట ఇన్.. అవుట్‌గా రహదారిని ఇవ్వడం పట్ల సర్వత్రా నిరసనలు వ్యక్తం అవుతున్నాయి. 79 వద్ద ఓ ప్రైవేట్ వైద్యుడు బౌండరీ లోపల కార్ పార్కింగ్ చేసుకున్న ఎన్ఎస్ఏఐ అధికారులు పట్టనట్టుగా వ్యవహరిస్తున్నారు. నిజాంసాగర్ మండలం ఆరేడు బస్టాప్ వద్ద రాత్రి వేళలో భారీ వాహనాలు నిలుపుతూ ఉన్న పోలీసులు ఎన్హెచ్ఈఏ అధికారులు పట్టించుకోకపోవడంతో రాకపోకలకు అంతరాయం కలుగుతున్న పట్టించుకునే నాథుడే కరువ య్యారు. ఈ బస్ స్టేషన్ వద్ద ఉన్న లాభాలు ఎస్ హెచ్ ఏఐ రహదారి నిర్మాణం అనంతరం వెలసిల్లాయి. ఈ దాబా యజమానులు దారిని వదలాలని విన్న వించినప్పటికీ ఎన్ హెచ్ ఏఐ అధికారులు అప్పట్లో గ్రీన్ సిగ్నల్ ఇవ్వలేదని తెలిసింది. 161వ రహదారి వెంటనే నరసింగరావుపల్లి కూడలి వద్దకు ఉన్న బ్రాహ్మణపల్లి, నర్సింగరావుపల్లి, మహాదేవుపల్లి, ఆరేడు బస్ స్టేషన్ల వద్ద వాహనాలను ఉండడంతో ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందో అని ఆందోళన చెందుతున్నారు. నిజాంసాగర్ మండలం అచ్చంపేట, మంగళూరు గ్రామాలకు వెళ్లే రహదారులున్నా ప్పటికీ ఎన్ని అధికారులు యూ టర్న్ ఏర్పాటు చేయలేక పోయారు. దీంతో ఈ గ్రామాలకు వెళ్లాలంటే నానా ఇబ్బందులు పడుతున్నారు. ప్రతీరోజు ఎన్‌హెచ్ఎఐ మొబైల్ బృందం రహ దారి వెంట పర్యవేక్షిస్తూ ఉన్న అక్రమ కబ్జాలు బస్‌స్టేషన్ల వద్ద రాత్రి వేళలో పార్కింగ్‌లు కనబడటం లేదా అని పలువు ఆరోపిస్తున్నారు. ఈ రహదారి నారాయణఖేడ్ నియోజకవర్గం నుంచి జుక్కల్ నియోజకవర్గం ఉన్నా రహదారి నరకయాతంగా మారింది. జుక్కల్ నియోజక వర్గం ఉన్న రహదారి సరిహద్దులను కబ్జా చేసుకుంటూ ఉన్న మొ బైల్ టీం సిబ్బంది చూసి చూడనట్లుగా వివరిస్తున్నారు. బస్‌స్టేషన్ వద్దనే డాబాలు ఉన్న రెండు జిల్లాల పోలీసులు పట్టింపులేని వ్యవహ రిస్తున్నారు. ఇప్పటికైనా ఎన్‌హెచ్ఎఐ అధికారులు స్పందించి ఈ బస్ స్టేషన్ల వద్ద పార్కింగ్ చేసే వాహనాలపై చర్య తీసుకోవడంతో పాటు ఆరేడు బస్టాప్ వెనకాల ఉన్న దాబాలకు ఇష్టారాజ్యంగా రహదారులు ఇవ్వడంతో దాబాల యజమాని ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారనే ఆరోపణలు, ఇకనైనా అధికారులు స్పందించి చర్యలు చేపట్టాలని మండల వాసులు కోరుతున్నారు

కాలువను కబ్జా చేశారు!

● కాలువలో ఇంటి నిర్మాణం
● పట్టించుకోని ఇరిగేషన్ అధికారులు
● సాగు నీరు పారేదెలా..!?

జర దేఖో!!



కాలువలో ఇంటి నిర్మాణం

మోపాల్, మార్చి 16 (ఆంధ్రజ్యోతి): గ్రామీణ ప్రాంతాల్లో కొందరు ప్రభుత్వ స్థలాలను కబ్జా చేసి ఇళ్ల నిర్మాణం చేసినా పట్టించుకునేవారు కరువయ్యారని పలు గ్రామాల ప్రజలు, రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మండలంలోని సిర్పూర్ గ్రామంలో ఓ వ్యక్తి వ్యవసాయ సాగునీరు కాలువను దర్జాగా కబ్జాచేసి ఇళ్ల నిర్మాణం చేసుకుంటున్నాడని గ్రామస్థులు ఆరోపించారు. గత కొన్ని సంవత్సరాల నుంచి ఈ కాలువ పారకం ద్వారానే అనేక మంది రైతులు వ్యవ సాయం చేసుకుంటూ గడుపుతున్నారు. సిర్పూర్ గ్రామం నుంచి మోపాల్‌కు వెళ్లే ప్రధాన దారిలో కాలువ పక్కనే ఇళ్ల నిర్మాణం చేస్తున్నాడు. ఈ విషయం పలువురు రైతులు అడ్డుకున్నా తాను అధికారుల అనుమతితోనే ఇళ్ల నిర్మాణం చేస్తున్నానని తనను అడ్డుకునేది లేదని ఎదురు సమాధానం ఇస్తున్నట్లు గ్రామస్థులు వాపోతున్నారు. గత కొన్నేళ్ల నుంచి ఈ కాలువ ఉందని గ్రామ రైతులు పేర్కొన్నారు. ఈ కాలువ ద్వారానే సుమారు 150 ఎకరాలకు పంట సాగునీరు అందుతుందని తెలిపారు. సిర్పూర్ పెద్ద చెరువు రామన్న చెరువుల నుంచి ఈ కాలువ ద్వారా రైతులకు సాగునీరు అందుతుందని తెలిపారు. ఇక్కడి నుంచే న్యాల్‌కల్ గ్రామంలో ఉన్న పల్లెకుంట చెరువుకు కూడా నీరు పోతుందని తెలిపారు. కాలువలో నిర్మిస్తున్న ఇంటి నిర్మాణం పనులను ఆపాలని సంబంధిత ఇరిగేషన్ అధికారులకు గ్రామ రైతులు విన్నవించుకున్న ప్రయోజనం లేదని గ్రామ రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. ఈ కాలువ ద్వారానే తమ తాతల కాలం నుంచి పంటలను పండించుకుంటూ వస్తున్నామని వివరించారు. అధికారులు ఇప్పటికైనా స్పందించకపోతే కాలువ అంతా కబ్జాకు గురయ్యే ప్రమాదం ఉందని గ్రామ రైతులు పేర్కొన్నారు. అనేక మంది రైతులు ఈ కాలువ ద్వారా వచ్చే సాగునీటిపై ఆధార పడే రైతులు ఉన్నారని తెలిపారు. ఇళ్ల నిర్మాణం పనులను ఆపక పోతే రైతులకు సాగునీరు ఎలా వస్తుందో ప్రత్యమ్నాయ మార్గాన్ని చూపాలని రైతులు కోరుతున్నారు.

గ్రామాల్లో భగీరథ నీరు కలుషితం

● పట్టించుకోని అధికారులు



జాన్కంపేట్ మిషన్ భగీరథ నుంచి సరఫరా అవుతున్న కలుషితమవుతున్న నీరు

వేల్పూర్, మార్చి 16 (ఆంధ్రజ్యోతి): వేల్పూర్ మండలం పచ్చలనడ్కుడ, జాన్కంపేట్‌తో పాటు పలు గ్రామాల్లో కొన్ని రోజులుగా మిషన్ భగీరథ ద్వారా కలుషిత తాగునీరు సరఫరా కావడంతో ఆయా గ్రామాల ప్రజలు తీవ్ర ఆందోళనకు గురవుతున్నారు. ఇలాంటి కలుషిత నీరు వస్తున్నప్పటికీ భగీరథ అధికారులు, సిబ్బంది తమకేమి పట్టనట్టుగా వ్యవహరించడం పట్ల ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. తప్పనిసరి పరిస్థితుల్లో కలుషిత నీళ్ల తాగితే తాము అనారోగ్యానికి గురై ఆసుపత్రి పాలవుతామని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మిషన్ భగీరథ నీటి పైప్‌లైన్‌లో ఎక్కడో ఒక చోట లీకేజీలు కావడం వల్లనే నీళ్ల కలుషితమవుతున్నాయంటున్నారు. అంతేగాకుండా మిషన్ భగీరథ ప్రాజెక్టు వద్ద నీటిని ఫిల్టర్ చేయడం కూడా లేదని ప్రజలు ఆరోపిస్తున్నారు. ప్రస్తుతం ప్రతీరోజు సరఫరా అవుతున్న మిషన్ భగీరథ నీరు, పసుపు, గోధుమ రంగులో రావడం వల్ల ఆ నీరు తాగడానికి ప్రజలు భయాందోళన చెందుతున్నారు. ఇప్పటికైనా మిషన్ భగీరథ అధికారులు స్పందించి కలుషితం కాకుండా చర్యలు తీసుకొని మంచి నీరు అందించాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు.



మెండోరలో మల్లన్నస్వామికి నైవేద్యాలు సమర్పిస్తున్న భక్తులు

వైభవంగా మల్లన్న స్వామి జాతర

మెండోర, మార్చి16 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో మల్లన్నస్వామి ఉత్సవాలను పురస్కరించుకొని ఆదివారం మల్లన్నస్వామికి భక్తులు నైవేద్యాలు సమర్పించారు. ఈ సందర్భంగా స్వామివారికి ఉదయం కల్యాణం నిర్వహించారు. అనంతరం గ్రామ ప్రజలు పెద్ద ఎత్తున స్వామి వారిని దర్శించుకొని, కుటుంబ సభ్యులతో కలిసి మల్లన్నస్వామికి నైవేద్యం సమర్పించారు. స్వామివారిని మొక్కులు చెల్లించుకునే భక్తులు చిన్న పిల్లలను బంగారంతో కాటవేశారు. సాయంత్రం యాదవ సంఘం ఆధ్వర్యంలో గ్రామ ఆలయం నుంచి బోనాలతో గుట్టకు చేరుకొని స్వామివారికి బోనాలు సమర్పించారు. ఈ కార్యక్రమంలో యాదవ సంఘం సభ్యులు, గ్రామ ప్రజలు, తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా ఓంకారేశ్వరస్వామి వార్షికోత్సవ వేడుకలు

కామారెడ్డిటౌన్, మార్చి 16 (ఆంధ్రజ్యోతి): కామారెడ్డి జిల్లా కేంద్రంలోని జయశంకర్ కాలనీలో గల ఓం కారేశ్వరస్వామి ఆలయ మూడోవార్షికోత్సవం వేడుకలు ఘనంగా ప్రారంభం అయ్యాయి. ఆదివారం ఉదయం ఆలయంలో మంగళచరణం, గంగాపూజ, గౌరిపూజ, మహాగణపతి పూజ, స్వామి, అమ్మవార్లకు పరిమళోధక మహాన్నపనం, రుద్రాబిషేకం వంటి కార్యక్రమాలు నిర్వహించారు. భిక్కనూరు సిద్ధగిరి సదాశివమహాంత్ శివాచార్య స్వామిజీ ఆలయంలో దీపారాధన చేసి కార్యక్రమాలను ప్రారంభించారు. ఆలయ ఆవరణలో 20 మంది జంటలతో లోక కల్యాణార్థం హోమం నిర్వహించి తీర్థ ప్రసాదాలు అందించారు. అనంతరం అన్నప్రసాద వితరణ చేపట్టారు. సాయంత్రం ధర్మశాల నుంచి పాత బస్టాండ్, పంచముఖి హనుమాన్‌కాలనీ మదుగా జయశంకర్ కాలనీలోని ఆలయం వరకు వీరశైవ లింగాయత్ సమాజ్ ఆధ్వర్యంలో 100మంది మహిళలు కలశాల ఊరేగింపు చేపట్టారు.



పట్టణంలో కలశాలను ఊరేగిస్తున్న మహిళలు

వ్యవసాయ యాంత్రీకీకరణకు
ప్రభుత్వం పచ్చజెండా



ట్రాక్టర్ ద్వారా విత్తనాలు వేస్తున్న రైతు

● రైతులకు అందనున్న రాయితీ యంత్రాలు ● రైతులకు మరింత ప్రయోజనం

ఆర్మూర్‌రూరల్, మార్చి 16 (ఆంధ్రజ్యోతి): వ్యవసాయ యాంత్రీ కరణకు ప్రభుత్వం గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. రైతులకు రాయితీపై వ్యవసాయ యంత్రాలు అందజేస్తేందుకు ప్రభుత్వం ప్రణాళిక రూపొందిస్తుంది. గత డిసెంబర్ నుంచి రైతులకు అవసరమైన వ్యవసాయ పరికరాలు, ఉపకరణాలు, యంత్రాలు రాయితీపై సరఫరా చేస్తామని ప్రభుత్వం ప్రకటించింది. దీంతో రైతుల్లో ఆశలు చిగురించాయి. నాలుగు నెలలు ఆలస్యం అయినప్పటికీ వ్యవసాయ యాంత్రీకరణకు ప్రభుత్వం పచ్చ జెండా ఊపింది. గత ప్రభుత్వ పాలనలో ఆరేళ్ల పాటు రాయితీపై వ్యవసాయ యంత్రాలు అందకపోవడంతో రైతులు ఇబ్బందులకు గురయ్యారు. వ్యవసాయ యాంత్రికీకరణ పథకంలో భాగంగా ప్రభుత్వం రైతులకు సబ్సిడీపై కల్టివేటర్‌లు, నాగళ్లు, రోటోవేటర్‌లు, తైవాన్ స్ప్రేయర్లు, పవర్ వీడర్‌లు, ట్రాక్టర్‌లు, మొక్కజొన్న మొలిచే యంత్రాలు, కిసాన్ డ్రోన్‌లతో పాటు ఇతర పరికరాలను అందజేయనున్నట్లు తెలిసింది.

● **గత ప్రభుత్వంలో అటకెక్కిన పథకం..**

అన్ని రంగాలలో మార్పులు వచ్చిన విధంగానే వ్యవసాయ రంగంలో విప్లవాత్మక మార్పులు వచ్చాయి. వ్యవసాయంలో రైతులకు సబ్సిడీపై గతంలో అనేక పరికరాలు, యంత్రాలు అందజేసేవారు. దీంతో రైతులు ఎంతో సంతోషించారు. ఆ సంతోషం కాస్త మూణ్నాళ్ల ముచ్చటే అయ్యింది. ఆధునిక వ్యవసాయంలో యంత్రాల ప్రవేశంతో వ్యవసాయ రంగానికి మంచి రోజులు వచ్చాయని రైతులు మురిసిపోయారు. కానీ గత కొన్నేళ్లుగా ప్రభుత్వం సబ్సిడీపై ఎలాంటి యంత్రాలు, పరికరాలు అందజేయడం లేదు. 2018 మార్చి నుంచి రాయితీపై వ్యవసాయ పరికరాలు రైతులకు అందలేదు. 2025 మార్చి నెల నుంచి ప్రభుత్వం వ్యవసాయ పనిముట్లను అందజేయాలని నిర్ణయం తీసుకున్నారు. సబ్సిడీపై యంత్రాలు అందజేస్తే వ్యవసాయంలో రైతులకు ఎంతగానో ప్రయోజనకరంగా ఉంటుంది. యంత్రాల వినియోగంతో తక్కువ ఖర్చుతో ఎక్కువ విస్తీర్ణంలో సాగు, తక్కువ సమయంలో పనులు పూర్తి అవ్వడమే గాకుండా వ్యవసాయం లాభసాటిగా ఉంటుంది. గతంతో వ్యవసాయానికి సబ్సిడీ యంత్రాలను ప్రభుత్వం సబ్సిడీపై అందజేసింది. 2018 సంవత్సరం వరకు సబ్సిడీ కొనసాగింది.

● **నియమ నిబంధనలు రావాల్సి ఉంది..**

వ్యవసాయ యాంత్రికీకరణకు జిల్లాకు ప్రభుత్వం నిధులు మంజూరు చేసినట్లు తెలిసింది. కేంద్ర ప్రభుత్వం రూ.25కోట్లు మంజూరు చేయగా రాష్ట్ర ప్రభుత్వం మరో రూ.25కోట్లు తనవంతు వాటగా కలిపి రాష్ట్రంలో యంత్రలక్ష్మీ కార్యక్రమం చేపట్టాల్సి ఉంటుంది. మార్చి 31 ఆర్థిక సంవత్సం ముగిసేలోగా వ్యవసాయ యంత్రీకరణ పథకం పూర్తి చేయాల్సి ఉంటుంది. ఈ పథకానికి సంబంధించి నియమ నిబంధనలు పూర్తిస్థాయిలో మార్గదర్శకాలు వస్తేగాని పథకానికి అర్హులయ్యేందుకు ఎంత భూమి ఉండాలి, ఎవరికి ఎంత ఇవ్వాలి అన్నది నిర్ణయించాల్సి ఉంటుంది. ఆర్థిక సంవత్సరం ముగిసేలోగా పథకం ప్రారంభించని పక్షంలో కేంద్రం నిధులు వెనక్కిపోయే అస్కారం ఉందని తెలుస్తోంది.

● **వ్యవసాయ యాంత్రికీకరణ వెంటనే ప్రారంభించాలి**

వ్యవసాయ యాంత్రికీకరణ పథకంలో భాగంగా సబ్సిడీపై రైతులకు అందజేసే వ్యవసాయ పరికరాలు, పరికరాలను వెంటనే అందజేస్తే రైతులకు ప్రయోజనకరంగా ఉంటుంది. సబ్సిడీపై యంత్ర పరికరాలు అందజేయాలన్న ప్రభుత్వ నిర్ణయంతో రైతుల్లో హర్షం వ్యక్తమవుతుంది.

● **కూలీల కొరతను అధిగమించవచ్చు**

వ్యవసాయ పనుల్లో యంత్రాలు వినియోగించడం వల్ల తక్కువ సమయంలో ఎక్కువ విస్తీర్ణంలో పంట సాగు చేసే వీలుంటుంది. విత్తనాలు వేయడం మొదలు నుంచి పంట కోత వరకు అన్ని పనులు యంత్రాల వల్ల చేయడంతో సమయం ఆదా అవుతుంది. అంతేగాక కూలీల కొరతను అధిగమించవచ్చు. గ్రామాలలో వ్యవసాయ పనులకు కూలీలు లభించక రైతులు ఇబ్బందులకు గురవుతున్నారు. ఇప్పటికే రైతులు యంత్రీకరణపై ఆధారపడి ఉన్నారు. వరి పంటకు చేతికొచ్చే సమయంలో కూలీలు లభించక ఇబ్బందులు ఎదురవుతున్నాయి. వరి కోత యంత్రాలు కొనుగోలు చేయడం రైతులకు భారమవుతుంది. వరి కోత యంత్రాలు అద్దెకు తీసుకొని పనులు వెల్లదీస్తున్నారు. ప్రభుత్వం యంత్ర పరికరాలు, వరి కొత యంత్రాలను సబ్సిడీపై అందిస్తే రైతుల ఇబ్బందులు దూరమవుతాయి.

● **అందుబాటులో లేని వరినాటు యంత్రాలు**

రైతులకు వరినాట్లు వేసే యంత్రాలు అందుబాటులో లేకపోవడంతో కూలీలపై ఆధారపడాల్సి వస్తుంది. గ్రామాల్లో సైతం పొలం పనులకు కూలీలు లభించక వరినాట్లు వేసే పనులకు ఇతర రాష్ట్రాలకు చెందిన కూలీలే ఆసరా అవుతున్నారు. జార్ఖండ్, ఉత్తరప్రదేశ్, పశ్చిమబెంగాల్, చత్తీస్‌ఘడ్ రాష్ట్రాల నుంచి వస్తున్న కూలీలచే రైతులు నాట్లు వేయిస్తున్నారు. వరినాటు యంత్రాలను ప్రభుత్వం సబ్సిడీపై అందజేస్తే రైతులకు ఎంతో ప్రయోజనకంగా ఉంటుంది.

● **రైతులకు పెట్టుబడి ఆదాకు అవకాశం**

సబ్సిడీపై వ్యవసాయ యంత్రాలు, పరికరాలు అందజేస్తే రైతులకు పెట్టుబడి ఖర్చులు తగ్గి డబ్బులు ఆదా అవుతాయి. రోటోవేటర్ లాంటి పరికరాల వినియోగంతో భూమి గుల్లాగా మారి సారవంతమవుతుంది. పిచికారి పరికరాలు (స్ప్రే) పంపులు రాయితీ ఇవ్వడం వల్ల రైతులకు లాభం చేకూరుతుంది. సీడ్‌కం ఫర్టిలైజర్, డ్రీల్ వినియోగం ద్వారా విత్తనమోతాదు, ఎరువులు మోతాదు ఆదా అయి రైతులకు బహువిధ లాభాలు చేకూరుతాయి. దీనివల్ల వ్యవసాయ పెట్టుబడి ఖర్చు తగ్గించి రైతులకు నికర ఆదాయం పెంచడానికి వీలు కలుగుతుంది.



యంత్ర పరికరాలు


ఆర్మూర్‌లో రిలే నిరాహార దీక్ష చేస్తున్న ఎమ్మార్పీఎస్ నాయకులు


ఇందల్వాయిలో..


సాలూరాలో ఎమ్మార్పీఎస్ దీక్షల దృశ్యం

ప్రత్యేక ఆర్డినెన్స్ తెచ్చి వర్గీకరణ అమలు చేయాలి

● ఎమ్మార్పీఎస్ జిల్లా కార్యదర్శి చేవూరి శ్యామ్

ఆర్మూర్‌టౌన్ మార్చి16(ఆంధ్రజ్యోతి): విడుదలైన ఉద్యోగ ఫలితాల్లో ప్రత్యేక ఆర్డినెన్స్ తెచ్చి ఎస్సీ వర్గీకరణ అమలు చేయాలని ఎమ్మార్పీఎస్ జిల్లా కార్యదర్శి చేవూరి శ్యామ్ అన్నారు. ఆదివారం పట్టణంలోని తహసీల్దార్ కార్యాలయం వద్ద ఏడవ రోజు రిలే నిరాహార దీక్షలు చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీఎం రేవంత్‌రెడ్డి ఎస్సీవర్గీకరణపై అసెంబ్లీలో మాట్లాడుతూ విడుదలైన ఉద్యోగ నోటిఫికేషన్‌లో ప్రత్యేక ఆర్డినెన్స్ ద్వారా వర్గీకరణ అమలు చేస్తామన్నారు. రాజ్యాంగ బద్ధమైన శాసన సభలో మాట్లాడిన మాటలు నిలబెట్టుకోకుండా మాదిలను మోసం చేస్తున్నారని మండిపడ్డారు. సీఎం రేవంత్‌రెడ్డికి మాదిగల పట్ల చిత్తశుద్ధిలేదని, గ్రూప్-1, 2, 3 ఉద్యోగాల్లో వర్గీకరణ అమలు చేయకుండా ఫలితాలను విడుదల చేయడాన్ని ఆయన తీవ్రంగా ఖండించారు. తక్షణమే వర్గీకరణ అమలు చేసి తన చిత్తశుద్ధిని నిరూపించుకోవాలని, లేనిపక్షంలో తగిన బుద్ధి చెబుతామని హెచ్చరించారు. ఈకార్యక్రమంలో ఎంఆర్‌పీఎస్ మండల అధ్యక్షుడు మైలారం రాము, ప్రధానకార్యదర్శి నూత్‌పల్లి సంతోష్, సద్దపల్లి గణేష్, సట్లపల్లిమల్కన్న, సుధాకర్, నవీన్, మైలారం ఎల్లవ్వ, పాల్గొన్నారు.

బోధన్‌రూరల్: ఎస్సీ వర్గీకరణకు చట్టబద్ధత కల్పించాలని అంత వరకు ఉద్యోగ ఫలితాలు నిలిపివేయాలని డిమాండ్ చేస్తూ రాష్ట్ర వ్యాప్తంగా జరుగుతున్న ఎమ్మార్పీఎస్ రిలే దీక్షల్లో భాగంగా ఆదివారం సాలూర మండల కేంద్రంలో చేపట్టిన రిలే దీక్షలు 5వ రోజుకు చేరుకున్నాయి. ఈ సందర్భంగా ఎమ్మార్పీఎస్ నాయకులు లింబూరి లక్ష్మణ్ మాట్లాడుతూ ఎస్సీ వర్గీకరణ ఏ రాష్ట్రంలో అమలు చేయని విధంగా తెలంగాణ రాష్ట్రంలో అమలు చేస్తామని సీఎం రేవంత్ రెడ్డి హామీ ఇచ్చి అనంతరం చట్టబద్దత కల్పించకుండా కాలయాపన చేస్తున్నారని ఆయన పేర్కొన్నారు. మాదిగలకు 11శాతం రిజర్వేషన్ కల్పించాలని డిమాండ్ చేశారు. ఎస్సీ వర్గీకరణకు చట్టబద్దత కల్పించిన తర్వాతనే ఉద్యోగ నియామకాలు అమలు చేయాలన్నారు. ఈ దీక్షల్లో ఎమ్మార్పీఎస్ నాయకులు భూరే శంకర్, నాగేష్, సుభాష్, రవికుమార్, రాజు, సాయికుమార్, చందు, సాయినాథ్, దత్తు, శివ, సంగేశ్వర్, మైత్రి రాజు, రామచంద్ర, సంతోష్, సాయికిరణ్, గంగారాజు తదితరులు పాల్గొనగా దీక్షలకు జిల్లా నాయకులు పోచీరాం సంఘీభావం తెలిపారు.

మోప్రా: చందూర్ మండల కేంద్రంలో 6వ రోజుకు ఎస్సీ వర్గీకరణ నిరవధిక దీక్షలు చేరుకున్నాయి. ఈ సందర్భంగా నిజామాబాద్ జిల్లా ఎమ్మార్పీఎస్ ప్రధాన కార్యదర్శి లస్సింగారి భూమయ్య మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర సీఎం రేవంత్ రెడ్డి తన రాజకీయ పునాది వేసింది మాదిగలేనని స్పష్టం చేశారని, తన రాజకీయ భవిష్యత్తు మొదలై అయినప్పటి నుండి మాదిగల సహకారం ఉందని తెలియజేశారు. అయినప్పటికీ మాదిగలకు ఎస్సీ వర్గీకరణ చేస్తానని చెప్పి ఇప్పుడు అన్యాయం చేస్తున్నారని గుర్తు చేశారు. ఎస్సీ వర్గీకరణ జరిగేంత వరకు ఈ పోరాటం ఆగదని ఇంకా కఠినమైన పోరాటాన్ని తాము సిద్ధమవుతామని ప్రభుత్వానికి హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో మండల ఎమ్మార్పీఎస్ అధ్యక్షులు దాకడి సాయిలు, గ్రామ పెద్దలు, మహారాజుల కాలనీ యూత్ సభ్యులు పాల్గొన్నారు.

సిరికొండ: మాదిగలకు 11 శాతం రిజర్వేషను కల్పించాలని కోరుతూ సిరికొండలో ఎమ్మార్పీఎస్ నాయకులు దీక్షలు చేపట్టారు. ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మంద కృష్ణమాదిగ పిలుపు మేరకు సిరికొండలో ఎస్సీలలో అత్యధికంగా జనాభాగల మాదిగలకు 9 శాతం కాకుండా 11 శాతం రిజర్వేషన్లను కల్పించాలని మండల కేంద్రంలో ఆదివారం నుంచి రిలే నిరహార దీక్షలు చేపట్టారు.ఈ కార్యక్రమంలో ఎంఆర్‌పీఎస్ మండల ఉపాధ్యక్షుడు కె.సంపత్,ప్రధాన కార్యదర్శి గణేష్,దుబ్బాక రాజన్న,కృష్ణ, సంతోష్, వెంకటేశ్,నర్సయ్య,కట్టు సాయన్న తదితరులు పాల్గొన్నారు.


మోప్రాలో నినాదాలు చేస్తున్న ఎమ్మార్పీఎస్ నాయకులు

ఇందల్వాయి: ఇందల్వాయి మండల కేంద్రంలో ఎస్సీ రిజర్వేషన్‌ల వర్గీకరణ చట్టబద్ధత చేయకుండా ఉద్యోగ ఫలితాలను విడుదల చేయడాన్ని నిరసిస్తూ మండల కేంద్రంలో ఆదివారం మాదిగ నాయకులు రిలే దీక్షలు చేపట్టడం జరిగింది. మాదిగ ఉపకులాల రిజర్వేషన్ల వర్గీకరణ సాధన కొరకు 30 ఏళ్లుగా పోరాడుతున్న ఇప్పటి వరకు ఎవరూ పట్టించుకోవడం లేదన్నారు. ఎస్సీ రిజర్వేషన్ల వర్గీకరణ విడుదలైన ఉద్యోగ నోటిఫికేషన్‌లలో ప్రత్యేక ఆర్డినెన్స్ తెచ్చి వర్గీకరణ అమలు చేయాలన్నారు. శాసనసభలో మాట్లాడిన మాటలకు సీఎం రేవంత్‌రెడ్డి కట్టుబడి ఉండాలన్నారు. గ్రూప్-1, 2, 3 ఉద్యోగాలలో వర్గీకరణ అమలు చేయకుండా ఫలితాలను విడుదల చేయడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో ఎంఆర్‌పీఎస్ ఇందల్వాయి మండల ఇంచార్జి నాగభూషణం మాదిగ, ఎంఆర్‌పీఎస్ డిచ్‌పల్లి ఇంచార్జి నర్సయ్య మాదిగ, ఎంఆర్‌పీఎస్ మోపాల్ ఇంచార్జి కిష్టయ్య మాదిగ, మహిళా విభాగం జాతీయ నాయకురాలు యమున మాదిగ, సత్తెక్క మాదిగ, తెట్టు ప్రభాకర్ మాదిగ, నామాల గంగాధర్ మాదిగ, ఎంఆర్‌పీఎస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

మోర్తాడ్ వేంకటేశ్వరస్వామి ఆలయంలో పూజలు


పూజలు చేస్తున్న ఎమ్మెల్యే వేముల ప్రశాంత్‌రెడ్డి

ఆర్మూర్‌రూరల్, మార్చి16(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని వెంకటేశ్వరస్వామి ఆలయంలో మాజీమంత్రి, ఎమ్మెల్యే వేముల ప్రశాంత్‌రెడ్డి స్వామివారి దర్శనం చేసుకొని పూజలు నిర్వహించారు. ఆదివారం జాతర సందర్భంగా ఎమ్మెల్యే వేముల ప్రశాంత్‌రెడ్డి ఆలయంలో ప్రత్యేక పూజలు చేసి పురోహితులు తక్కూరి ప్రవీణ్‌చారి, పండితుల ఆశీస్సులు పొందారు. ఈ కార్యక్రమంలో వీడీసీ అధ్యక్షుడు జక్కం అశోక్, బద్దం రవి, బోగ ఆనంద్, గ్రామ కమిటీ సభ్యులు, పార్టీ నాయకులు పాల్గొన్నారు.

వేంకటేశ్వర ఆలయంలో ప్రముఖుల పూజలు


మోర్తాడ్ ఆలయంలో పూజలు చేస్తున్న ఈరవత్రి అనిల్, మానాల మోహన్‌రెడ్డి

మోర్తాడ్, మార్చి16(ఆంధ్రజ్యోతి):మండల కేంద్రంలోని వేంకటేశ్వర స్వామి జాతరను పురస్కరించుకొని ఆదివారం రాత్రి రాష్ట్ర ఖనిజాభివృద్ధి సంస్థ చైర్మన్ ఈరవత్రి అనిల్, రాష్ట్ర సహకార సంస్థ చైర్మన్ మానాల మోహన్‌రెడ్డి లు దేవాలయంలో పూజలు నిర్వహించారు. మొదటగా ఆలయంలో ధ్వజ స్తంభానికి మొక్కి వేంకటేశ్వరస్వామికి పూజలు చేశారు. ఈసందర్భంగా ఆలయ పూజరులు వారికి ఆశీస్సులు అందజేశారు. ఈ సందర్భంగా ఆల యంలో జాతర గురించి అడిగితెలుసుకున్నారు. ఈకార్యక్రమంలో వీడీసీ అధ్యక్షుడు జక్కం అశోక్, మహిపాల్‌రెడ్డి, గిర్మాజీ గోపి, గ్రామ కమిటీ సభ్యులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

నేడు మార్కెట్ కమిటీలో పసుపుపై సమావేశం

నిజామాబాద్, మార్చి 16 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): నిజామాబాద్ వ్యవసాయ మార్కెట్ కమిటీలో నేడు పసుపుపై సమావేశం జరుగనుంది. ఈసమావేశంలో రాష్ట్ర విత్తనాభివృద్ధి సంస్థ చైర్మన్ అన్వేష్‌రెడ్డి, అదనపు కలెక్టర్ కిరణ్‌కుమార్, మార్కెట్ కమిటీ చైర్మన్ ముప్పగంగారెడ్డి, మార్కెటింగ్ అధికారులు, వ్యాపారులు, అర్తిదారులు, రైతు సంఘాల నేతలు, రైతులతో జరుగనుంది. ఈ సమావేశంలో పసుపు ధరలపై చర్చించనున్నారు. జిల్లాతో పాటు ఇతర జిల్లాల్లో సాగైన పసుపు ఇక్కడికి వస్తుండటంతో అమ్మకాల్లో సమస్యలు వస్తున్నాయి. వీటన్నింటిని చర్చించి నిర్ణయం తీసుకోనున్నారు. రైతులకు వివరించడంతో పాటు ప్రతీరోజు నిర్ణీత మొత్తంలో పసుపు తీసుకువచ్చే విధంగా అవగాహన కల్పించనున్నారు. గతకొన్ని రోజులుగా మార్కెట్‌లో పసుపు ధరలు తగ్గుతుండటంతో ప్రభుత్వ ఆదేశాల మేరకు జిల్లా కలెక్టర్ ఆదేశాలతో ఈ సమావేశాన్ని నిర్వహిస్తున్నారు.

నేడు దివ్యాంగ విద్యార్థులకు సహాయ ఉపకరణాల పంపిణీ

నిజామాబాద్ అర్బన్, మార్చి 16 (ఆంధ్రజ్యోతి): జిల్లా విద్యాశాఖ సమగ్ర శిక్షా ఆధ్వర్యంలో అలీమ్‌కో సహకారంతో జిల్లాలోని దివ్యాంగ విద్యార్థులకు సోమవారం సహాయ ఉపకరణాల పంపిణీ చేయనున్నట్లు జిల్లా సహిత విద్య సమన్వయకర్త పి.శ్రీనివాస్‌రావు తెలిపారు. జిల్లా వ్యాప్తంగా 275 మంది దివ్యాంగ విద్యార్థులను గుర్తించినట్లు ఆయన తెలిపారు. వీరిలో 17 మందికి బ్రెయిలీ కిట్, 44 మందికి ఇయర్ కిట్‌లు, 63 మందికి వీల్‌చైర్‌లు, 87 మందికి ఎంఆర్ కిట్‌లు, 8 మందికి ట్రైసైకిళ్లు, 5 గురికి రోలార్ కిట్‌లు, ఇతరులకు 51 కిట్‌లను పంపిణీ చేయనున్నారు. నగరంలోని న్యూ ఎన్‌జీవోస్ కాలనీలోని ఎస్ఎస్ కన్వెన్షన్ హాల్‌లో ఈ సహాయ ఉపకరణాలను పంపిణీ చేయనున్నారు. ఈ కార్యక్రమానికి జిల్లా కలెక్టర్, విద్యాశాఖ అధికారి హాజరుకానున్నట్లు ఆయన తెలిపారు. జిల్లాలోని దివ్యాంగ విద్యార్థులు సంబంధిత ధ్రువీకరణ పత్రాలను తీసుకొని రావాలని ఆయన కోరారు.

'పది' విద్యార్థులకు అభినందన సభ


మాట్లాడుతున్న డీఈవో అశోక్

నిజామాబాద్ అర్బన్, మార్చి 16 (ఆంధ్రజ్యోతి): పదవ తరగతి ప్రతిభ పరీక్షల్లో ఉత్తమ ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు జిల్లా విద్యాశాఖ అధికారి అశోక్ బహుమతులు అందజేశారు. ఆదివారం నగరంలోని ప్రెస్‌క్లబ్‌లో యుఎస్‌ఎఫ్‌ఐ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో పదవ తరగతి ప్రతిభ పరీక్షల్లో ఉత్తమ ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు బహుమతుల ప్రధానం చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన డీఈవో అశోక్ మాట్లాడుతూ విద్యార్థుల్లో ఉన్న సృజనాత్మకతను వెలికి తీసే విధంగా ఇలాంటి ప్రతిభ పోటీలు నిర్వహించడం అభినందనీయమన్నారు. ప్రశాంత వాతావరణంలో పదవ తరగతి పరీక్షలు రాయాలని ఆయన విద్యార్థులకు సూచించారు. ఈ కార్యక్రమంలో యుఎస్‌ఎఫ్‌ఐ జిల్లా కార్యదర్శి పెద్ది సూరి, న్యాయవాది అన్వేష్, గణేష్, మహేష్, తదితరులు పాల్గొన్నారు.

పసుపును రూ.15వేల ధరతో కొనుగోలు చేయాలి



ఫోటో నంబరు : 25పి- మాట్లాడుతున్న భూమయ్య

డిచ్‌పల్లి, మార్చి 16 (ఆంధ్రజ్యోతి): పసుపు క్వింటాలుకు రూ.15వేల ధరతో కొనుగోలు చేయాలని ఏఐకేఎంఎస్ జిల్లా అధ్యక్షుడు వేల్పూర్ భూమయ్య డిమాండ్ చేశారు. ఆదివారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ పసుపు రైతులు గత పక్షం రోజులుగా మార్కెట్‌లోకి పసుపును తెచ్చి అమ్ముకుందామంటే రైతులకు తగిన ధరలు రాక ఆందోళన చెందుతున్నారని అన్నారు. మధ్య దళారీలు, వ్యాపారస్తులు సిండికేట్‌లుగా మారి ధరలను తగ్గించి రైతులను నిలువు దోపిడి చేస్తు న్నారని అన్నారు. పంటకు పెట్టిన పెట్టుబడులు కూడా రైతులకు రాకపోవ డంతో అల్లాడుతున్నారని అన్నారు. గతంలో క్వింటాలుకు రూ.16వేల ధరలు చెల్లించిన వ్యాపారస్తులు నేడు రూ.8వేల నుంచి 9వేల వరకు ధరలు పెట్టడం లేదని ప్రధానంగా మార్కెట్‌లో వ్యాపారస్తులు సిండికేట్‌లుగా మారి ధరలు తగ్గిస్తున్నారని అన్నారు. రైతులకు 2లక్షల రుణమాఫీ చేయాలని, చక్కెర ఫ్యాక్టరీలను ప్రభుత్వమే తెరిపించి నడిపించాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో దేవస్వామి, గంగాధర్, సాయిలు, తదితరులు ఉన్నారు.

18న వారాంతపు సంత, మేకల సంతల వేలంపాట

నవీపేట,మార్చి16(ఆంధ్రజ్యోతి): నవీపేట గ్రామ పంచాయతీ పరిధిలో ప్రతి శుక్రవారం జరిగే వారాంతపు సంత, శనివారం జరిగే మేకల సంతలకు సంబంధించి ఈ నెల 18న వేలంపాట నిర్వహించడం జరుగుతుందని పంచాయతీ కార్యదర్శి రవీందర్ నాయక్ తెలిపారు. 2025-26సంవత్సరానికి సంబంధించి వారాంతపు సంతకు లక్ష రూపాయలు, మేకల సంతకు లక్ష రూపాయల చొప్పున డిపాజిట్ చెల్లించి వేలంపాటలో పాల్గొనాలని ఆయన కోరారు. మధ్యాహ్నం 12గంటలకు స్థానిక గ్రామ పంచాయతీ కార్యాలయంలో ఈ వేలంపాట నిర్వహించడం జరుగుతుందని ఆయన వివరించారు.

రోడ్డు ప్రమాదంలో బాలుడికి తీవ్రగాయాలు


రోడ్డు ప్రమాదంలో బోల్తాపడ్డ కారు

ఖిల్లా,మార్చి16(ఆంధ్రజ్యోతి) జిల్లా కేంద్రంలోని బైపాస్ రోడ్డుప్రభుత్వ గిరిరాజ్‌కళాశాల సమీపంలో సైకిల్‌పై వె ళ్తున్న బాలుడిని కారు ఢీ కొట్టిన ఘటనలో శెహబాద్ అనే బాలుడికి తీవ్రగాయాలు అయ్యా యి. హైదరాబాద్‌కు చెందిన ఓ కుటుంబం బాసర వెళ్తుండగా ఈ ఘటన ఆదివారం చోటు చేసుకుంది. సైకిల్‌పై వెళ్తున్న బాలుడిని తప్పించబోయి కారు అదుపు తప్పి బోల్తాపడింది. ఈ ఘటనలో కారులో ప్రయాణిస్తున్న ఐదుగురికి గాయాలు అయ్యాయి. సమాచారం అందుకున్న మూడో టౌన్ ఎస్ఐ హరిబాబు సిబ్బందితో ఘటన స్థలానికి చేరుకుని క్షతగాత్రులను చికిత్స నిమిత్తం ఆస్పత్రికి తరలించారు. బాలుడి పరిస్థితి విషమంగా ఉందని తెలిపారు.

కలిగోట్‌లో జవహర్ నవోదయ పాఠశాలను ఏర్పాటు చేయాలి

● బీజేపీ జిల్లా అధ్యక్షుడు దినేష్‌కులచారి

జక్రాన్‌పల్లి, మార్చి16(ఆంధ్రజ్యోతి): మండలంలోని కలిగోట్ గ్రామం లోని జవహర్ నవోదయ పాఠశాలను ఏర్పాటు చేయాలని బీజేపీ జిల్లా అధ్యక్షుడు దినేష్‌కులచారి అన్నారు. ఆదివారం జక్రాన్‌పల్లి మండలం కలిగోట్ గ్రామంలో జవహర్ నవోదయ పాఠశాలకు కేటాయించిన స్థలా న్ని ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా దినేష్ కులచారి మాట్లాడుతూ స్థానిక ఎమ్మెల్యే డాక్టర్ భూపతిరెడ్డి నవోదయ పాఠశాలను కలిగోట్‌లోనే ఏర్పాటు చేసే విధంగా చొరవ తీసుకోవాలన్నారు. అన్ని విధాలా సౌకర్యంగా ఉన్న ఈ ప్రాంతంలో నవోదయ పాఠశాల ఏర్పా టుకు ఎంతో అనువైందని తెలిపారు. ఎంపీ అర్వింద్ కలిగోట్ గ్రామానికి ఈ పాఠశాల వచ్చేందుకు కృషి చేశారని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో అసెంబ్లీ కన్వీనర్ పద్మరెడ్డి, మండల బీజేపీ అధ్యక్షుడు కన్నెపల్లి ప్రసాద్, జిల్లా కిసాన్‌మోర్చ అధ్యక్షుడు తిరుపతిరెడ్డి, బీజేపీ నాయకులు నరేష్‌యాదవ్, మహేందర్, దత్తుగౌడ్, శ్యామ్‌రెడ్డి, విక్రం, శ్రీనివాస్‌రెడ్డి, వీడీసీసభ్యులు, తదితరులు పాలొగన్నారు.

● ప్రజాసమస్యలను పట్టించుకోని ఎమ్మెల్యే: దినేష్ కులాచారి

డిచ్‌పల్లి: ప్రజాసమస్యలను రూరల్ ఎమ్మెల్యే భూపతిరెడ్డి పట్టించుకోవడం లేదని బీజేపీ జిల్లా అధ్యక్షుడు దినేష్ కులాచారి అన్నారు. ఇందూరు అభివృద్ధి, నిజామాబాద్ గ్రామీణ నియోజకవర్గంలో చేపట్టిన అభివృద్ధిపై రూరల్ ఎమ్మెల్యే డాక్టర్ భూపతిరెడ్డిని చర్చకు రావాలని తాము సవాల్ చేసి ఇటుకబట్టిల వద్ద ఎమ్మెల్యే కోసం ఫ్లెక్సీలను సైతం ఏర్పాటు చేసి ఆహ్వానించామని అన్నారు. సాయంత్రం వరకు వేచి ఉన్న ఎమ్మెల్యే రాలేదని గ్రామాల్లో అభివృద్ధిపై భూపతిరెడ్డికి చిత్తశుద్ధి లేకపోవడం వల్లనే చర్చకు రాలేదని అన్నారు. జిల్లాలో ఎంపీ అర్వింద్ చేపట్టిన అభివృద్ధి పనులపై తాము ఏ రోజైన చర్చకు సిద్ధం అని పేర్కొన్నారు. ఆదివారం డిచ్‌పల్లి మండలం నడిపల్లి ఇటుక బట్టీ వద్ద ఎమ్మెల్యే భూపతిరెడ్డి చర్చకు వస్తారని స్వాగతం ఫ్లెక్సీతో ఆయనతో పాటు బీజేపీ శ్రేణులు ఎదురు చూశారు. ఎంపీ అర్వింద్‌పై ఎమ్మెల్యే భూపతిరెడ్డి, కాంగ్రెస్ శ్రేణులు అవాస్తవ ఆరోపణలు చేసి ముందు పునరాలోచించుకోవాలని సూచించారు. గ్రామీణంలో లక్ష ఎకరాలకు సాగునీరు, మంచిప్ప మాసాని పథకం, నవోదయ, గల్ఫ్ బాధితుల సమస్యతో పాటు ప్రజలు సమస్యల గురించి ప్రశ్నించడానికి ఎమ్మెల్యే భూపతిరెడ్డి చర్చ కోసం సవాల్ విసిరినట్లు పేర్కొన్నారు. వారం పాటు గడువు ఇచ్చిన ఎమ్మెల్యే రాకపోవడం సిగ్గుచేటని విమర్శించారు. నియోజకవర్గంలో 140 తాండాలు ఉన్నాయని ఒక్కొక్క తాండాకు కోటి రూపాయలతో ప్రతిపాదనలు పంపిస్తే తాను కేంద్రం నుంచి 140 కోట్ల నిధులు తీసుకువస్తానని పేర్కొన్నారు. ఎన్నికల సమయంలో తనకు అండగా ఉంటానని చెప్పిన మాజీ మంత్రి మండవ వెంకటేశ్వరరావు పోలింగ్‌కు ముందు భూపతిరెడ్డికి మద్దతు ఇవ్వడంలో అంతర్యమేమిటని దినేష్ అన్నారు. ప్రజల కోసం పనిచేసే ఎమ్మెల్యే అయితే చర్చకు వచ్చేవారని మరోసారి గడ్కోల్ వద్ద చర్చకు అవకాశం ఇస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు. మాజీ మంత్రి, బోధన్ ఎమ్మెల్యే సుదర్శన్ రెడ్డి జిల్లా అభివృద్ధిని విస్మరిస్తున్నారని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షులు కర్నే చంద్రకాంత్, జిల్లా అధ్యక్షులు సతీష్‌రెడ్డి, అసెంబ్లీ కన్వీనర్ పద్మారెడ్డి, నాయకులు వినోద్, శ్యామ్‌రావు, సుదర్శన్ రెడ్డి, విజయ్, తదితరులు పాల్గొన్నారు.


స్థలాన్ని పరిశీలిస్తున్న బీజేపీ జిల్లా అధ్యక్షుడు దినేష్‌కులాచారి

బౌద్ధభిక్షుల నిరాహార దీక్షకు సంఘీభావం తెలిపిన అంబేద్కర్ సంఘం

వేల్పూర్, మార్చి16(ఆంధ్రజ్యోతి): బిహార్ రాష్ట్రంలో బుద్ధగాయల్ బౌద్ధ భిక్షువులు చేస్తున్న నిరాహార దీక్షకు వేల్పూర్ మండల అంబేద్కర్ యువజన సంఘం సంఘీభావం తెలియజేశారు. బౌద్ధభిక్షువులు చేసున్న నిరాహార దీక్ష నేటికి 33రోజులు గడిచాయని అది పవిత్ర స్థలం బౌద్ధులకే చెందాలని, అది మాత్రం హిందువులది కాదని, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు 1940 చట్టాన్ని రద్దు చేయాలని అంబేద్కర్ యువజన సంఘం సభ్యులు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో అంబేద్కర్ యువజన సంఘం మండల అధ్యక్షుడు జె.ప్రభాకర్, ప్రధానకార్యదర్శి జంబవ చామర్, ఉపాధ్యక్షుడు నారాయణ, శివకృష్ణ, కార్యవర్గ సభ్యులు పాల్‌రాజ్, అజయ్, మండల అంబేద్కర్ యువజన సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

అమ్దాపూర్‌లో ఘనంగా బోనాల పండుగ


బోనాలను తీసుకెళ్తున్న మహిళలు

బోధన్‌రూరల్,మార్చి16(ఆంధ్రజ్యోతి): బోధన్ మండలంలోని అమ్దాపూర్ గ్రామంలో ఆదివారం శ్రీ పోచమ్మ అమ్మవారి బోనాల పండుగను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామస్థులు బోనాలతో ఊరేగింపుగా అమ్మవారి ఆలయానికి చేరుకున్నారు. అమ్మవారి ఆలయంలో ఒడిబియ్యం నింపి ప్రత్యేక పూజలు నిర్వహించారు. పాడిపంటలు చల్లగా ఉండాలని, అందరు ఆయురారోగ్యాలతో ఉండాలని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో గ్రామస్థులు, గ్రామ పెద్దలు, మహిళలు పాల్గొన్నారు.

హొన్నాజీపేటలో ఒకరి హత్య

● డబ్బుల కోసం ఘాతుకం ● పోలీసుల అదుపులో మృతుడి భార్య, కొడుకు


మృతుడు మల్లయ్య

ధర్పల్లి, మార్చి 16 (ఆంధ్రజ్యోతి): డబ్బుల కోసం తన భర్తను కొడుకుతో కలిసి హత్య చేసిన ఘటన మండలంలోని హొన్నాజీపేట గ్రామంలో ఆదివారం చోటు చేసుకుంది. దీనికి సంబంధించిన వివరాలు ఈ విధంగా ఉన్నాయి. మండలంలోని హొన్నాజీపేట గ్రామానికి చెందిన పాలెం నడిపి మల్లయ్య (60), భార్య లక్ష్మి, కుమారుడు మధుతో కలిసి నివాసం ఉంటున్నారు. తరచూ డబ్బుల విషయంలో భార్య, భర్త, కుమారుడికి గొడవలు జరిగేవి. ఈక్రమంలో శనివారం రాత్రి 7గంటల ప్రాంతంలో గ్రామంలోని ఒకదుకాణం వద్ద తండ్రితో కొడుకు డబ్బుల కోసం గొడవపడ్డాడు. అక్కడే ఇరువురి మధ్య తీవ్ర గొడవ కావడంతో గ్రామస్థులు ఇద్దరికి నచ్చచెప్పి పంపించారు. కొడుకు ఎలాగైనా తండ్రిని వదిలించుకోవాలనే నిర్ణయించుకొని ఇంటికి వెళ్తూ మధ్యలో ఒక ఖాళీ బీరు సీసాను వెంట తీసుకెళ్లాడు. గ్రామంలో జరిగిన గొడవను తన తల్లి లక్ష్మికి కొడుకు వివరించాడు. రాత్రి 10గంటల ప్రాంతంలో తండ్రి నడిపి మల్లయ్య ఇంటికి చేరుకున్నాడు. ఇంట్లో సైతం ఇరువురు గొడవ పడ్డారు. మల్లయ్యను భార్య లక్ష్మి, కొడుకు మధులు మెడను పట్టుకొని నేలకు కొట్టారు. దీంతో మల్లయ్యకు తల భాగంలో తీవ్ర గాయాలు అయ్యాయి. ఈ క్రమంలోనే మల్లయ్య లేవబోతుండగా కొడుకు తన వెంట తెచ్చుకున్న బీరు సీసాతో తలపై బాదాడు. మల్లయ్యకు తీవ్రగాయాలు కావడంతో అక్కడికక్కడే చనిపోయాడు. తలనుంచి, చెవుల నుంచి తీవ్ర రక్తస్రావం జరిగింది. మృతుడిని పోస్టుమార్టం నిమిత్తం జిల్లా ఆసుపత్రికి తరలించారు. సీఐ బిక్షపతి, ఎస్సై రామకృష్ణ సంఘటన స్థలానికి చేరుకొని పరిస్థి తిని సమీక్షించి మృ తుడి భార్య, కొడుకు పోలీస్ స్టేషన్‌కు తరలించారు. డబ్బుల విషయంలో జరిగిన గొడవ చిలికి చిలికి గాలి వానలా హత్యకు దారి తీసింది. నడిపి మల్లయ్య పేరున ఉన్న భూమిని అమ్మి డబ్బులు చేజిక్కించుకోవాలన్న భా ర్య, కొడుకుల అత్యాశతో నడిపి మల్లయ్య హత్యకు దారి తీసింది. గ్రామంలో పశు వులను మేపుతూ కొద్దో గొప్పో సంపాదించుకున్న మల్లయ్య డబ్బుల విషయంలో భార్య, కొడుకుల మధ్య జరిగిన ఘర్షణ హత్యకు దారి తీయడంతో గ్రామంలో విషాద చాయలు అలుముకున్నాయి.

చికెన్ ధరలు

రకం	: లైవ్	విత్‌స్కిన్	స్కిన్‌లెస్
సుగుణ (కిలో)	: రూ.150	రూ.220	రూ. 240
వెన్‌కాబ్(కిలో)	: రూ.160	రూ.230	రూ. 250

బంగారం ధరలు

బిస్కెట్ (10 గ్రా.)	ఆర్నమెంట్(10 గ్రా.)	వెండి(10 గ్రా.)
రూ.89,900	రూ.82,900	రూ.1040

సినిమా గైడ్ నిజామాబాద్

పీవీఆర్ మల్టీప్లెక్స్.. వేణుమాల్

స్క్రీన్-1 : చావా (తెలుగు) (10.00, 4.15)
: ఆఫీసర్ ఆన్ డ్యూటీ (1.20)
: కోర్టు (7.35, 10.40)
స్క్రీన్-2 : కోర్టు (10.00, 4.25)
: చావా (తెలుగు) (1.05, 7.30)
: చావా (హిందీ) (10.50)
స్క్రీన్-3 : చావా (హిందీ) (10.30, 1.50)
: ల్యాంప్ (5.10)
: రిటర్న్ ఆఫ్ ది డ్రాగెన్ (తెలుగు) (7.35)
యుగానికి ఒక్కడు (10.45)
స్క్రీన్-4 : దిల్‌రూబా (10.15, 4.10, 7.20, 10.30)
1000 వాలా (1.25)

ఉషాప్రసాద్ మల్టీప్లెక్స్..

స్క్రీన్-1 : దిల్‌రూబా (11.00)
: కోర్టు (1.45, 7.20, 10.20)
: యుగానికి ఒక్కడు (4.40)
స్క్రీన్-2 : యుగానికి ఒక్కడు (11.00)
: చావా (హిందీ) (1.40)
: దిల్‌రూబా (4.35, 7.30, 10.30)
స్క్రీన్-3 : ఆఫీసర్ ఆన్ డ్యూటీ (1.30, 7.30)
: చావా (తెలుగు) (4.30, 10.20)

దేవి : దిల్‌రూబా (11.15, 2.15, 6.15, 9.15)
నటరాజ్ : యుగానికి ఒక్కడు (11.15, 2.15, 6.15, 9.15)
విజయ్ : చావా (తెలుగు) (11.15, 2.15, 6.15, 9.15)
లలితామహాల్: కోర్టు (11.15, 2.15, 6.15, 9.15)

- నిజామాబాద్ అర్బన్